పిల్లల కచ్చితమైన బరువును గుర్తించాలి : సీడీపీఓ



నవతెలంగాణ-మిర్యాలగూడ

పిల్లల ఖచ్చితమైన బరువులను గుర్తించాలని ఐసిడిఎస్ సిడిపిఓ మమతా కోరారు. సోమవారం స్థానిక హౌసింగ్ బోర్డు లో సత్య సాయి మందిరంలో ప్రాజెక్టు మీటింగ్ నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క అంగన్వాడీ టీచర్ సర్వే లో ఉన్న పిల్లలందరికీ నాణ్యమైన ఎత్తు, బరువులను తీసి ఎన్‌హెచ్‌టిఎస్ యాప్ సర్వేలో గుర్తించాలన్నారు. నల్గొండ నుండి ఐటి డీసీ రమాదేవి మాట్లాడుతూ ఎన్ హెచ్ టి ఎస్ సర్వే వందశాతం కంప్లీట్ చేయాలని,టీచర్స్ కి ఉన్న టెక్నికల్ ప్రాబ్లమ్స్ పైన సందేహాలు నివృత్తి చేయడం చేశారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ లు రేవతి, మాధవి, పద్మ, లీలాకుమారి, రాధిక, సుశీల, నజీమా బేగం బ్లాక్ కో ఆర్డినేటర్ కవిత,అంగన్వాడీ టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

శేరిగూడెంలో బడిబాట కార్యక్రమం

నవతెలంగాణ-చండూరు



గట్టుపల్ మండలం పరిధిలోని ప్రాథమికోన్నత పాఠశాల తేరట్పల్లి ఉపాధ్యాయుడు ఉదావత్ లచ్చిరామ్ బడిబాటలో వినూత్న ప్రచారం చేస్తూ... ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికై తన వంతు కృషి చేస్తున్నాడు. సోమవారం శేరిగూడెం గ్రామంలో బడిబాటలో భాగంగా ప్రచారం చేస్తూ... ఎడ్ల బండి పై తన తండ్రితో పొలం బాట పడుతున్న బాలుడ్ని చూసి ఎడ్ల బండిని ఆపి పెద్దలు పనికి పోవాలని,పిల్లలు బడికి పోవాలని సూచిస్తూ... పొలం బాట కాదు బడిబాట పట్టే సమయం ఆసన్నమైనదని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు ఉన్నాయని గుణాత్మక విద్యను అందించుటకు అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు.



- మానసిక ఒత్తిడికిలోనవుతున్న విస్తరణ అధికారులు
- రైతు ప్రమేయం లేకుండా సన్నాలకు బోనస్ గుర్తించడం సాధ్యమా....?
- ట్యాబ్‌లు లేక సొంత డబ్బుతో సెల్ ఫోన్ల కొనుగోలు

వ్యవసాయం సర్వం ఆన్‌లైన్ అయ్యింది.. రైతు సాగు చేస్తున్న వివరాలు ఏ పంట సాగు చేస్తున్నాడు.. ఎన్ని ఎకరాలలో సాగు చేస్తున్నాడు అన్న వివరాలు ఆన్‌లైన్ చేయడంతో ఏఈఓలు పని భారంతో మానసిక ఒత్తిడి అధికమై వేదనకు గురవుతున్న పరిస్థితి ఉంది. ప్రభుత్వ పథకాలు అంతా ఆన్‌లైన్ కావడంతో ఏ ఇన్ఫర్మేషన్ కావాలన్నా ఆన్‌లైన్ ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉంది ఇలాంటి పరిస్థితులలో ఏఈఓలు పడుతున్న ఇబ్బందులపై నవ తెలంగాణ ప్రత్యేక కథనం

ఆన్‌లైన్‌తో.. ఏఈఓలపై పనిభారం

నవతెలంగాణ-నకిరేకల్

నకిరేకల్ సహాయ వ్యవసాయ సంచాలకుల పరిధిలో నకిరేకల్, కేతేపల్లి, కట్టంగూర్, శాలిగౌరారం, నార్కట్ పల్లి, చిట్యాల మండలాలు ఉన్నాయి. ప్రతి ఐదు వేల ఎకరాలకు ఒక ఏఈఓ ను నియమించాలని నిబంధన ఉన్న అలాంటి పరిస్థితి ఏ ఒక్క మండలంలో లేదు. నకిరేకల్ మండలంలో 28 వేల ఎకరాలు సాగులో ఉంటే ముగ్గురు, కేతపల్లి మండలంలో 31 వేల ఎకరాలు సాగులో ఉంటే ముగ్గురు, కట్టంగూరు మండలంలో 37,500 ఎకరాలు సాగులో ఉంటే ముగ్గురు, శాలిగౌరారం మండలంలో 45 వేల ఎకరాలు సాగులో ఉంటే ఐదుగురు, నార్కట్ పల్లి మండలంలో 44,500 ఎకరాలు సాగులో ఉంటే ఐదుగురు, చిట్యాల మండలంలో 40 వేల ఎకరాలు సాగులో ఉంటే ఐదుగురు ఏఈవోలు ఉన్న పరిస్థితి ఉంది. ఐదు ఎకరాల పరిధిలో విధులు నిర్వహించాల్సిన ఏ ఈ వోలు సుమారు 8 నుండి పదివేల ఎకరాలకు విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఉంది.

ఆన్ లైన్ కోసం ట్యాబ్ లు ఇవ్వరా...?

2018-2019 లో ఏఈఓ లకు ఆన్లైన్ విధుల కోసం ట్యాబులు పంపిణీ చేశారు. అవి ఇచ్చిన ఆరు నెలలకే మూలకు చేరాయి. ఇక అప్పటినుండి ట్యాబ్ లు పంపిణీ చేసిన పరిస్థితి లేదు. దీంతో ఏఈవోలు క్రాఫ్ ఇన్సూరెన్స్, రైతుబంధు, రైతు బీమా, పిఎం కిసాన్, పంటల నమోదు తదితర పనుల ఆన్ లైన్ ఎంట్రీ కి ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కొక్క ఏఈఓ ప్రతి ఏడాదికి రూ 30 వేల చొప్పున ఒక సెల్ ఫోన్ కొనుగోలు చేస్తున్నారు. ఒక మండలంలోని ఒక ప్రాంతానికి బదిలీ అయినా ఏఈఓ ఏఈవోలు రైతుల ప్రమేయం లేకుండా పంటల నమోదు చేయడం కత్తి మీద సాముగా మారింది. గ్రామంలో సర్వేనెంబర్ సబ్ డివిజన్ ఎలా గుర్తించగలుగుతారు. పొలాలకు దారులు సరిగా లేవు. ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. ఇలాంటి పరిస్థితిలో ఏఈఓ లపై పనిభారం అధికం చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నిస్తున్నారు.

పంటల నమోదులో రైతుల ప్రమేయం ఉండాలి

పంటల నమోదులో రైతుల ప్రమేయం ఉండాలని ఏఈవోలు పేర్కొంటున్నారు. పంటల నమోదును రైతులు మీ సేవలో దరఖాస్తు చేసుకునే విధంగా ఉండాలి. ఫలాన రైతు, ఫలాన సర్వే నెంబర్ లో ఉన్న రెండు ఎకరాలలో ఏ పంటలు సాగుచేసిన వివరాలతో రైతులు మీ సేవలో దరఖాస్తు చేసుకోవడం వల్ల ఏఈవోలు క్రాఫ్ బుకింగ్ వెరిఫికేషన్ కు వెళ్లినప్పుడు ఇబ్బందులు లేకుండా ఉంటాయని పేర్కొంటున్నారు. అదేవిధంగా ప్రభుత్వం సన్నాల్లకే బోనస్ అని అంటుంది ఒక ఏఈఓ పరిధిలో ఉన్న ఎనిమిది నుండి పది ఎకరాల లోపు ఏ రైతు ఎక్కడ సన్నాలు వేశాడన్న విషయాలు గుర్తించడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నిస్తున్నారు.

ఏఈఓల డిమాండ్స్ ...

క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న ఏఈఓ లకు ఉచితంగా టు వీలర్ అందజేయాలి.ప్రతి ఏడాది ఏఈఓ లకు కొత్త ట్యాబ్ అందించాలి.ప్రస్తుతం ఏఈఓ లకిస్తున్న ఎఫ్ టి ఏను పెంచాలి.ఫీల్డ్ వర్క్ లో ఏఈఓ లకు ప్రమాదం జరిగి మృతి చెందితే వారి కుటుంబానికి రూ. కోటి ఎక్స్ గ్రేషియా అందించాలి.

ఫీల్డ్ వర్క్‌లో ఉన్న ఇబ్బందులను తొలగించండి
విజయలక్ష్మి, ఏఈఓ, ఎల్లారెడ్డిగూడెం



గ్రామాలలో క్షేత్రస్థాయిలో చేస్తున్న ఫీల్డ్ వర్క్ లో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నకిరేకల్ డివిజన్ పరిధిలో 11 మంది మహిళా ఏఈవోలు ఉన్నారు. వారికి కనీస వసతులు లేవు. గ్రామాలకు వెళ్లాలంటే కనీస రవాణా సదుపాయాలు లేవు. ఆటోలే శరణ్యం. మంది సరిపోను ఉంటేనే ఆటో బయలుదేరుతుంది. దీనివల్ల విధులకు ఆటంకం కలుగుతుంది. ఏఈఓ లకు ప్రభుత్వం ఉచితంగా టూవీలర్లను అందజేయాలి.

ప్రతి ఏడాది ట్యాబ్ లను అందజేయాలి
ఏ. లింగయ్య, ఏఈఓ పాలెం, నకిరేకల్.



ఐదేళ్ల క్రితం ఏఈఓ లకు ట్యాబ్ లు అందజేశారు అవి ఇచ్చిన ఆరు నెలలకే ఖరాబైనైయి. అప్పటినుండి తాము సొంతంగా కొనుగోలు చేసుకున్న సెల్ ఫోన్ లపై మాత్రమే ఆన్లైన్ ఎంట్రీ జరుగుతుంది. ప్రభుత్వం స్పందించి ప్రతి ఏడాది ప్రతి ఏ ఈ ఓ కు ఉచితంగా ట్యాబ్ లు అందజేయాలి. అదేవిధంగా ఫీల్డ్ వర్క్ లో రైతుల ప్రమేయం కచ్చితంగా ఉండాలి.

విద్యార్థులకు అన్ని రకాల ప్రోత్సాహకాలు అందించాలి

- సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు
- పద్మశాలి విద్యార్థుల ప్రతిభాపురస్కార కార్యక్రమం

నవతెలంగాణ-చిట్యాలటౌన్



గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభగల విద్యార్థులను గుర్తించి అన్ని రకాల ప్రోత్సాహకాలు అందించాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి మండల కేంద్రంలో విద్యలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను ఎంపిక చేసిన సేవలు భక్త మార్కండేయ పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చెరుపల్లి మాట్లాడుతూ కష్టపడి చదివిన వారికి ఎప్పుడు ఐనా ఉన్నతస్థాయికి చేరుకుంటారన్నారు. ప్రతిబా వంతులైన విద్యార్థులను గుర్తించి పురస్కార సభ నిర్వహించే నిర్వాహకులను అభినందించారు. ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులు విద్యలోనే కాకుండా ఆట పాటలతోపాటు అన్ని రంగాల్లోనూ ముందుండాలని కోరారు. రిటైర్డ్ జడ్జి కుకుడాల లక్ష్మణ్ మాట్లాడుతూ యువత చదువే సమాజం మార్పు కోసం దోహద పడుతుందని, పురస్కార విజేతలకు శుభాకాంక్షలు, విద్యార్థుల తల్లిదండ్రులను అభినందనలు తెలిపారు. కుకుడాల గోవర్ధన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ కోమటిరెడ్డి చిన్న వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్ జిట్ట నగేష్, కాంగ్రెస్ నాయకులు పోకల దేవదాసు,జడల చిన్న మల్లయ్య, మిర్యాల ప్రకాష్, గంజి వెంకటేశ్వర్లు,పెద్ది నరేందర్, గంజి గోవర్ధన్ ,మూడ వేణు, చెరుపల్లి శ్రీను,జెల్ల సత్తయ్య మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ దాసరి హరిచందన

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్



ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దాసరి చందన జిల్లా అధికారులను ఆదేశించారు. పార్లమెంటు ఎన్నికలు, వరంగల్, ఖమ్మం, నల్గొండ శాసన మండలి పట్టభద్రుల ఉప ఎన్నికల అనంతరం తిరిగి సోమవారం ప్రారంభమైన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె ప్రజల వద్ద నుండి వారి సమస్యల పై దరఖాస్తులను స్వీకరించారు. రెండున్నర నెలల తర్వాత తిరిగి నిర్వహించిన ఈ ప్రజా వాని కార్యక్రమానికి జిల్లా కలెక్టరేట్‌కు పెద్ద ఎత్తున దరఖాస్తుదారులు వచ్చి వారి సమస్యలపై జిల్లా కలెక్టర్ కు, అధికారులకు దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఫిర్యాదులను స్వీకరిస్తూ జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ కొన్ని ఫిర్యాదులకు అక్కడికక్కడే అధికారులను తన వద్దకు పిలిపించుకొని పరిష్కారం చేశారు. మరికొన్ని పరిశీలించి విచారణ చేసి పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం జిల్లా అధికారులతో ఆమె మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా స్వీకరించిన దరఖాస్తులన్నింటిని వెంటనే పరిష్కరించాలని, జాప్యం చేయవద్దని తెలిపారు. సోమవారం నాటి ప్రజావాణి దరఖాస్తులలో వ్యక్తిగత సమస్యలతో పాటు, విద్య ,ఉద్యోగం, ఉపాధి, భూమి సంబంధిత ఫిర్యాదులు ఎక్కువగా వచ్చాయి. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణ చంద్ర, డిఆర్ఓ రాజ్యలక్ష్మి తో పాటు, జిల్లా అధికారులు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.

కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే వేముల వీరేశం

నవతెలంగాణ- నకిరేకల్



కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ కృషి చేస్తుందని స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని పన్నాల గూడెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద బీఆర్ఎస్ కెవిఎస్ నుండి సుమారు 30 మంది నాయకులు ఐఎన్‌టీయూసీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఒక్కరి సంక్షేమం కోసం పాటుపడుతుందన్నారు 100 రోజులలో నాలుగు గ్యారెంటీలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ నాయకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మెన్‌పై నెగ్గిన అవిశ్వాస తీర్మానం

- అవిశ్వాసానికి మద్దతు పలికిన 14 మంది డైరెక్టర్లు
- నూతన చైర్మెన్‌గా కుంభం శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ- నల్లగొండ డెస్క్



డీసీసీబీ చైర్మెన్ గొంగిడి మహేందర్ రెడ్డి పై సోమవారం పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. అవిశ్వాసానికి మద్దతుగా 14 మంది డైరెక్టర్లు ఓటు వేశారు. నూతన డైరెక్టర్‌గా మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రధాన అనుచరుడు కుంభం శ్రీనివాస్ రెడ్డిని డైరెక్టర్లు ఏకగ్రీవంగా సోమవారం జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నారు. డీసీసీబీ చైర్మెన్‌గా ఉన్న మహేందర్ రెడ్డి ఏకపక్ష నిర్ణయాలతో అవినీతి అక్రమాలకు పాల్పడడమే కాకుండా అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు డైరెక్టర్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన చైర్మెన్ మాట్లాడుతూ మహేందర్ రెడ్డి అక్రమాలను వెలికి తీస్తానని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం పాటుపడతామని వివరించారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులను పూర్తి చేయాలి

- కలెక్టర్ దాసరి హరిచందన

నవతెలంగాణ- నల్గొండ కలెక్టరేట్

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులన్నీటిని వెంటనే పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ దాసరి హరి చందన ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె తన చాంబర్లో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు, విద్యార్థులకు దుస్తుల పంపిణీ పై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈనెల 12న పాఠశాలలు పునః ప్రారంభమవుతున్న దృష్ట్యా అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని,విద్యార్థులకు దుస్తుల పంపిణీకి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి. పూర్ణచంద్ర, మిషన్ భగీరథ ఎస్ఈ డి. వెంకటేశ్వర్లు, వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రమాద జోన్లను పరిశీలించిన ఎమ్మెల్యే , అధికారులు

నవతెలంగాణ-మిర్యాలగూడ

మిర్యాలగూడ నియోజకవర్గంలో గత కొన్ని రోజులుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించాలన్న ఉద్దేశంతో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ పోలీస్ ఉన్నత అధికారులతో నియోజకవర్గ వ్యాప్తంగా ప్రమాదకరంగా ఉన్న పలు యాక్సిడెంట్స్ జోన్లను సోమవారం సాయంత్రం పరిశీలించారు. వేములపల్లి జంక్షన్, శెట్టిపాలెం జంక్షన్, అన్నపురెడ్డి గూడెం జంక్షన్, ఏడుకోట్ల తండా జంక్షన్, రామచంద్రగూడెం వై జంక్షన్ , నందిపాడు బైపాస్ జంక్షన్, చిల్లాపురం జంక్షన్, చింతపల్లి బైపాస్ జంక్షన్, ఈదులగూడ బైపాస్ జంక్షన్, గూడూరు జంక్షన్ లలో అత్యధికంగా ప్రమాదాలు జరుగుతున్న జోన్స్ ను అధికారులతో కలిసి గుర్తించి జాతీయ రహదారుల అధికారులతో కలిసి సందర్శించి ప్రమాదాలను నియంత్రించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించాలన్నారు. వీలైనంత త్వరగా పరిష్కారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిఎస్పి కె.రాజశేఖర్ రాజు, ఒన్, టూ టౌన్, రూరల్ సిఐలు సుధాకర్, నాగార్జున, కె. వీరబాబు, ఎస్ఐలు, జాతీయ రహదారుల, రాష్ట్ర రహదారుల అధికారులున్నారు.

అర్హులకు సంక్షే పథకాలు

- ఎమ్మెల్యేనేనావత్ బాలునాయక్

నవతెలంగాణ- దేవరకొండ



ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందించడంతోపాటు అభివృద్ధి పనులను సకాలంలో పూర్తయ్యేలా అధికారులు చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ సూచించారు. సోమవారం నేరేడుగొమ్ము మండల ఎంపీపీ బిక్కు నాయక్ అధ్యక్షతన జరిగిన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. పలువురు ఎంపీటీసీలు తమ మండలంలో నెలకొన్న వివిధ సమస్యలపై ప్రశ్నించగా,వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యల గురించి అధికారులు వివరించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు కలసి మండలాన్ని అభివృద్ధి పరచాలని సూచించారు.రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఫారెస్ట్ అధికారులు అడవులపై ఆధారపడి జీవించే స్థానిక ప్రజలను ఇబ్బందులకు గురి చేయకుండా చూడాలన్నారు. ప్రస్తుతం ఈదురు గాలుల వల్ల కరెంటు తీగలపై చెట్లను పడకుండా ముందస్తుగానే చెట్లను తొలగించాలని అధికారులను సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ బాలు నాయక్, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కబ్జాల నుంచి శ్మశాన వాటిక స్థలాన్ని కాపాడండి

నవతెలంగాణ-మిర్యాలగూడ



కబ్జాల నుంచి శ్మశాన వాటిక స్థలాన్ని కాపాడాలని గ్రామస్తులు సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మండలంలోని సుబ్బారెడ్డి గూడెం గ్రామంలో ఎస్సీ కాలనీలో శ్మశాన వాటిక లేకపోవడంతో పాతకాలువ వద్ద దానం చేస్తున్నామని కొంతమంది కాల్వ పక్కన ఉన్న రైతులు శ్మశాన వాటిక లేకుండా స్థలాన్ని కబ్జా చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కబ్జా నుండి ఆ స్థలాన్ని కాపాడాలని కోరారు. మండలంలోని తడక మల్ల గ్రామం నుండి మొదలై రాయిని పాలెం చివరి వరకు గల మూసి కాలువ ద్వారా అనేకమంది రైతులకు నీరు అందించడం జరుగుతుందన్నారు. ఈ కాలువ కింద ఉన్న రైతులు కాలువ కట్టను కబ్జా చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు మంద సైదులు, మంద శివ, ఆదిముల్లా నాగేశ్వరరావు, ఇంద్రపల్లి గురవయ్య, రెమిడాల యేసయ్య, మచ్చ నాగయ్య, మంద నగేష్, ఇంద్ర పల్లి అభి తదితరులు ఉన్నారు.

బాలునాయక్‌తోనే అభివృద్ధి సాధ్యం

- కల్లుగీతా కార్మికుల సంఘం జిల్లా కన్వీనర్ జంగయ్యగౌడ్

నవతెలంగాణ- చింతపల్లి



ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ద్వారానే దేవరకొండ నియోజకవర్గం లోని అన్ని మండలాల అభివృద్ధి జరుగుతుందని కల్లు గీత కార్మికుల సంఘం జిల్లా కన్వీనర్ అనంతుల జంగయ్య గౌడ్, జిల్లా నాయకులు అనంతల మల్లేష్ గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని కుర్మేడు ఎక్స్ రోడ్‌లో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. గౌడ సంఘం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి నేనావత్ బాలు నాయక్ అని అన్నారు. గత ప్రభుత్వం నక్కలగండి ప్రాజెక్టును పూర్తిచేస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పూర్తి కాలేదని రైతు ప్రభుత్వం అని చెప్పిన అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ 10 ఏండ్ల కాలంలో తమ కుటుంబమే అభివృద్ధి చెందిందని, ఓడిపోయినా నాయకులు ఇంకా పరిపాలనలోనే ఉన్నామని భ్రమ పడుతున్నారన్నారు. త్వరలోనే కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలు చేస్తుందన్నారు. దేవరకొండ వెనుకబడ్డ నియోజకవర్గమని బాలునాయక్ కు మంత్రి పదవి ఇచ్చి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే దిశగా గా చూడాలని కోరారు. భూదాన్ భూములు లావణ్య పట్టాలు కూడా ఎక్కడపడితే అక్కడ బై నెంబర్ లేసి బినామీల పేర్ల పట్టా చేయించుకున్నారని ఆరోపించారు. రైతులకు భూమాత ద్వారా సరైన న్యాయం జరుగుతుందని ఏ ఒక్క రైతు కూడా అధైర్య పడద్దని అన్నారు.

నీటి కుంటలను తలపిస్తున్న రోడ్లు, ప్రభుత్వ కార్యాలయాలు

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు, వాహనదారులు

నవతెలంగాణ-నాంపల్లి



రహదారుల వెంట నివాస గృహాలు ఎత్తుగా నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్నారు. డ్రెయినేజీ కాలువలను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేస్తున్న గ్రామపంచాయతీ పట్టించుకోకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా రహదారులపై, చౌరస్తాలలో వర్షపు నీరు ఎక్కడ వెళ్లకుండా నిలువ ఉండడంతో రహదారులు నీటి కుంటలను తలపిస్తున్నాయి. నాంపల్లి మండల కేంద్రం అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం వెనుక భాగంలో, గాలెంక అయోధ్య చౌరస్తాలో, పలు వీదుల్లో వర్షపు నీరు ఎటు వెళ్లకపోవడంతో బాటసారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా లోతట్టు ప్రాంతంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయం చుట్టుపక్కల నుండి బయటికి నీరు వెళ్లే కల్వర్టును కొంతమంది పూడ్చివేసి ఆక్రమించుకున్నారు. వర్షం కురిసిన ప్రతిసారి తహసిల్దార్ కార్యాలయం ముందు భారీగా నీరు చేరుతుంది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి వర్షపు నీరు బయటికి పోవడానికి డబుల్ రోడ్డు నిర్మాణ సమయంలో కల్వర్టు నిర్మించినప్పటికీ పాఠశాల నుండి కల్వర్టు వరకు కాలువ నిర్మించకుండా వదిలేయడంతో కాలువ నిర్మించాల్సినప్రాంతాన్ని కొందరు తమ అవసరాల కోసం ఆక్రమించుకున్నారు. పాఠశాల నుండి వర్షపు నీరు బయటకు వెళ్లకుండా పాఠశాల ఆట స్థలం మొత్తం నీటికుంటగా మారుతుంది. అదేవిధంగా గ్రామంలో ఎండిపోయిన చెట్లను, గాలికి సగం వరకు నేలకొరిగి ప్రమాదకరంగా మారిన చెట్లను తొలగించాలని, గ్రామంలో వర్షాల వల్ల నీటి నిల్వ ఉండి సమసాత్మకంగా ఉన్న ప్రాంతాలను అధికారులు గుర్తించి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

ఎండిపోయిన చెట్టును తెలగించాలి
సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి



మండల కేంద్రంలోని స్నేహపురి కాలనీలో గ్రామీణ వికాస్ బ్యాంక్ పక్కన ప్రమాదకరంగా ఉన్న ఎండిపోయిన చెట్టు పుచ్చిపోయి ఉంది. అది విరిగి ప్రయాణికులపై, దారి వెంట నడిచి వెళ్లే వారిపై పడే ప్రమాదం ఉన్నందున అధికారులు తక్షణమే చెట్టును తొలగించారు. హెచ్చరిక బోర్డులు రేడియం స్టిక్కర్లు అతికించి ఎలాంటి ప్రమాదం జరగకుండా చూడాలి. నిలిచిపోయిన వర్షపు నీళ్లని కాలువలలోకి మళ్లించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
సూర్యాపేట
మంగళవారం | జూన్ 11, 2024 | www.navatelangana.com

ఘనంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-తిరుమలగిరి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ పుట్టినరోజ వేడుకలు సోమవారం మండల కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా శ్రీనివాస్ గౌడ్ పుట్టినరోజు సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్ హాస్పిటల్లో పేషెంట్లకు పండ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తన్నీరు రాంప్రభు మాట్లాడుతూ బీసీల హక్కుల సాధన కోసం మూడున్నర దశాబ్దాలుగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలతో పోరాటం చేస్తూ విద్యార్థి ,యువజనుల పక్షాన, వివిధ కులాల హక్కుల సాధన కోసం పోరాడుతున్నటువంటి నాయకుడు జాజుల శ్రీనివాస్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు శ్యామ్ యాదవ్, బ్రహ్మం, యాదగిరి, ఉపేంద్ర గౌడ్, శేఖర్, సోమకృష్ణ, తరుణ్ పాల్గొన్నారు.

లాటరీ పద్ధతి ద్వారా లబ్దిదారుల ఎంపిక

నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్

2024-25 విద్యా సంవత్సరంలో గిరిజన సంక్షేమ శాఖ యందు బెస్ట్ అవైలబుల్ పథకం కింద దరఖాస్తు చేసుకున్న గిరిజన విద్యార్థిని, విద్యార్థులకు ఈ నెల 12న ఉదయం 11.00 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయం, సూర్యాపేటలోని సమావేశం మందిరం లో లాటరీ పద్ధతి ద్వారా విద్యార్థిని,విద్యార్థులను ఎంపిక చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 31 సీట్లకు గాను 330 మంది విద్యార్థిని, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడం జరిగింది అని కావున ఇట్టి లాటరీ పద్ధతి కార్యక్రమానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు, ఆసక్తి గల ప్రజాప్రతినిధులు గిరిజన నాయకులు హాజరు కావాలని కోరారు.

ఫీజుల దరువు.. బతుకు బరువు

- ప్రయివేట్ పాఠశాలల్లో ఫీజుల మోత
- కార్పొరేట్ మాయాజాలం
- చదువు తక్కువ-ఫీజు లెక్కువ
- ఒలంపియాడ్, టెక్నో, కాంన్సెప్ట్, టాలెంట్, ఇంటర్నేషనల్ పేర్లతో టోకరా
- చోద్యం చూస్తున్న ప్రభుత్వం
- ఫీజులపై నియంత్రణ చట్టం తేవాలి.... ప్రజా సంఘాలు

నవతెలంగాణ-సూర్యాపేట

సమాజంలో విద్యపై అధిక ప్రాధాన్యత పెరిగింది. గ్రామ, పట్టణ ప్రాంతాల్లో పిల్లల భవిష్యత్ కోసం తల్లిదండ్రులు చదివించడానికి ఖర్చులకు వెనుకాడడం లేదు. దీన్ని ఆసరాగా చేసుకున్న ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజులను పెంచి అందినకాడికి దండుకుంటున్నాయి. ఇందుకు గాను జిల్లా వ్యాప్తంగా ఏజెంట్లను పెట్టుకొని వివిధ రకాల పేర్లతో మోసగిస్తూ విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించు కుంటున్నారు. ఈ నెల 12న పాఠశాలలు ప్రారంభం కాబోతున్నాయి. ఎప్పటిలాగే ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలు ఫీజుల దోపిడీకి లక్షల రూపాయల డొనేషన్లతో సామాన్య ప్రజల నడ్డి విరచడానికి సిద్ధమవుతున్నాయి..

సూర్యాపేట జిల్లాలో విద్యాలయాలు వ్యాపారకేంద్రాలుగా మారాయి. అందులో భాగంగా భారీగా ఫీజుల పెంపు, దుస్తులు, పుస్తకాల పేరుతో అడ్డగోలు దందాతో సామాన్య కుటుంబాల జీవితాలు చితికి పోతున్నాయి. పిల్లలను ఉన్నత స్థానాల్లో చూడాలనుకోవడం, మధ్యతరగతి, దిగువ మధ్య తరగతి తల్లిదండ్రుల్లో ఆశ ఉంటుంది. ఆటో డ్రైవర్ సైతం తన పిల్లల బంగారు భవిష్యత్ కోసం కార్పొరేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నాడు. ఒక విద్యార్థి ఎల్కేజీ నుంచి పదవతరగతి వరకు పూర్తి చేయాలంటే తక్కువలో తక్కువ రూ.5 నుంచి 10 లక్షలు ఖర్చు అవుతుంది. ఏండ్ల తరబడి రెక్కలు ముక్కలు చేసి సంపాదించిన డబ్బును ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలకు విద్యార్థుల చదువు కోసం తల్లిదండ్రులు దారపోస్తున్నారు. కానీ శిక్షణ లేని ఉపాధ్యాయుల వల్ల విద్యార్థులు అనుకున్న రీతిలో రాణించలేక చదువుల్లో వెనుకబడుతున్నారు.



జిల్లాలో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు 1275 వరకు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ప్రైమరీస్కూల్స్ 695 ఉండగా అప్పర్ ప్రైమరీస్కూల్స్ 83, హైస్కూల్స్ 224 మొత్తం కలుపుకొని పాఠశాలలు 1002 ఉన్నాయి. ప్రయివేట్ పాఠశాలలు, ప్రైమరీ స్కూల్స్ 21, అప్పర్ ప్రైమరీ స్కూల్స్ 107, హైస్కూల్స్ 147 కలుపుకొని మొత్తం 275 ఉన్నాయి. నాలుగేళ్ల పిల్లాడు ఎల్కేజీలో చేరాలంటే రూ.10 నుంచి రూ.20 వేల మధ్య చెల్లించాల్సి ఉంటుంది. ఇది కేవలం ట్యూషన్ ఫీజు మాత్రమే. ఇంక డొనేషన్, బిల్డింగ్ ఫండ్, రిజిస్ట్రేషన్ ఫీజు, అడ్మిషన్ ఫీజు, రవాణా, యూనిఫామ్, పుస్తకాలు, పెన్నుల ఖర్చులు అధనంగా భరించాల్సి ఉంటుంది. తరగతి పెరిగే కొద్ది ఫీజులు కూడా పెరుగుతుంటాయి. పదవ తరగతి చదవడానికి అన్ని రకాల ఖర్చులు కలుపుకుంటే రూ.50వేలకు పైగానే ఖర్చు చేయక తప్పడం లేదు.

విద్యారంగాన్ని ప్రభుత్వం ప్రయివేట్ పరం చేస్తుండడం ప్రజల పాలిట శాపంగా మారుతుంది. కొన్ని పాఠశాలలు ఒలంపియాడ్, టెక్నో కాన్సెప్ట్, టాలెంట్, ఇంటర్నేషనల్ పేర్లతో యథేచ్ఛగా దందా కొనసాగిస్తున్నారు. ఇదిగాక ఒకటో తరగతి నుంచి ఐఐటి ఫౌండేషన్ అంటూ తల్లిదండ్రులను నిలువునా దోచుకుంటున్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన వాటితోపాటు ఎలాంటి గుర్తింపు లేని పాఠశాలల్లో కూడా ఫీజుల మోత మోగుతుంది. వసూలు చేస్తున్న ఫీజులకు, పాఠశాలలోని సౌకర్యాలకు పొంతన ఉండదనే విమర్శలు నెలకొన్నాయి. అపార్ట్మెంట్లలో ఉన్న స్కూళ్లు, అగ్గిపెట్టెల్లాంటి గదుల్లో తరగతులు, శిక్షణ లేని ఉపాధ్యాయులతో పాటు మౌలిక సదుపాయాల కొరత పట్టి పీడిస్తున్నాయి. పుస్తకాలు, యూనిఫామ్లు తమ వద్దే కొనుగోలు చేయాలని నిబంధనలు వేధిస్తున్నాయి. ఇదిగాక డే-స్కాలర్లకు, హాస్టల్లో ఉండేవారికి వేర్వేరుగా ఫీజులను నిర్ణయిస్తున్నారు. మూడో తరగతి నుంచే హాస్టల్స్ నిర్వహిస్తూ రకరకాల ఫీజులతో దోపిడీ చేస్తున్నారు. ఈ తతంగం అంతా బాహాటంగా జరుగుతున్నప్పటికీ చర్యలు తీసుకోవడంలో అధికారులు, ప్రభుత్వం విఫలమవుతున్నది. కేజీ టు పీజీ ఉచిత విద్య అనే నినాదంతో అధికారంలోకి వచ్చిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం నినాదాన్ని పక్కకు పెట్టి ప్రయివేట్, కార్పొరేట్ సంస్థలకు రెడ్ కార్పెట్ పరుస్తూ సామాన్యుల నడ్డి విరిచిన విషయం తెల్సిందే. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అయినా ప్రయివేట్, కార్పొరేట్ సంస్థలపై నజర్ పెట్టి ఫీజుల పెంపును నివారించేందుకు కృషి చేయాలని పలువురు కోరుతున్నారు. పుస్తకాలు, యూనిఫామ్లు తమ వద్దే కొనుగోలు చేయాలని పాఠశాలలు నిబంధనలు పెట్టి వేధిస్తే చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించడం కొంతలో కొంత తల్లిదండ్రులకు ఊరట లభించింది.

ప్రతి సంవత్సరం జూన్ లో ప్రారంభమయ్యే పాఠశాలలకు ముందే తల్లిదండ్రులు విద్యార్థుల చదువులకయ్యే ఖర్చులపై బడ్జెట్ రూపకల్పనలో తలమునకలవుతున్నారు. ప్రభుత్వాలు ఎన్ని హామీలు చేస్తున్నప్పటికీ ఫీజుల నియంత్రణ చట్టాన్ని మాత్రం అమల్లోకి తీసుకు రాలేకపోతోంది. తక్షణమే ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని సీపీఐ(ఎం)కి చెందిన అనుబంధ ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. లేని పక్షంలో విద్యాసంవత్సరంలో పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధపడుతామని హెచ్చరిస్తున్నాయి.



ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలి

- గత సంవత్సరం పెండింగ్ బిల్లులు చెల్లించాలని విన్నపం
- కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగిన గ్రామస్తులు

నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్

చివ్వెంల మండలంలోని బండమీది చందుపట్ల గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ గుయ్యం రవి అవినీతి అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణ చేయాలని గ్రీవెన్స్‌డేలో జిల్లా కలెక్టర్ వెంకట్రావుకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. సోమవారం 150 మంది గ్రామస్తులు కలెక్టరేట్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఉపాధి హామీ పనులకు వెళ్ళని వారికి హాజర్లు వేసి అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. ఈ సంవత్సరం ఏప్రిల్, మే నెలలో పనిచేసిన వారికి డబ్బులు చెల్లించడం లేదన్నారు. పని చేసిన వారికి పే స్లిప్పులు ఇవ్వడం లేదని ఫీల్డ్ అసిస్టెంట్ రవిని అడిగితే ' నేను ఇవ్వను మీరు ఎం చేస్తారో చేసుకోండి'అని బెదిరిస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దరఖాస్తు చేసుకున్నా పనికల్పించడం లేదని పేర్కొన్నారు. హైదరాబాద్, హుజుర్‌నగర్ వలస వెళ్లిన వారు, గ్రామంలో ఉండి పనికి వెళ్ళని వారిని గ్రూపులుగా ఏర్పాటు చేసి వారికి హాజర్లు వేసి ప్రభుత్వ సొమ్మును కాజేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. లేని వారికి హాజర్లు వేయడంతో పనికి వెళ్లిన వారికి రోజు కూలీ రూ. 120 మాత్రమే వేసి తమకు అన్యాయం చేశారని... ఇప్పుడు పని కల్పించమని అడిగితే ఎస్టిమేట్ లేదు పని లేదని చెపుతున్నారని, గ్రామంలో లేని వారికీ హాజర్లు వేయడంతో ఇప్పుడు తమకు పని లేకుండా పోయిందని కలెక్టర్ ముందు తమ గోడును వెళ్ళబోసుకున్నారు. రోజుకు సగటున రూ.280 కూలీ ఇవ్వాలని గ్రామస్తులు కోరారు. 150 మందికి పైగా గ్రామస్తులు కలెక్టర్ వెంకట్రావు కు వినతిపత్రం ఇచ్చిన అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. దీంతో డిఆర్‌డిఏ పీడీమధుసూదన రాజు వారి వద్దకు చేరుకొని రెండు రోజుల్లో పూర్తి విచారణ చేసి సమస్యను పరిష్కరిస్తామని గ్రామస్తులకు చెప్పారు. గ్రామానికి అధికారులు వచ్చినప్పుడు తమ సమస్యలు చెప్పుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఆనంతుల యల్లయ్య, కొండేటి ఉపేందర్, సునీల్, అభిమల్ల వెంకన్న, రేణుక, సునీత, లక్ష్మి, మోలుగురి జానమ్మ, వినోద, మైసమ్మ, యల్లమ్మ, లలిత, వెంకటమ్మ, గుర్వమ్మ, చిన్న యల్లమ్మ, గుద్దేటి వెంకటమ్మ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వం లిఫ్ట్‌లను నిర్వీర్యం చేసింది

- సాగర్ ఎడమ కాలువపై ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్‌లు పూర్తిస్థాయి
- సామర్థ్యంతో పని చేయాలి
- జులై 1 నాటికి లిఫ్ట్ ఇరిగేషన్లన్నీ వినియోగంలోకి తేవాలి
- నియోజకవర్గ రైతులకు అండగా ఉంటా
- భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి

నవతెలంగాణ కోదాడరూరల్

గత ప్రభుత్వం సాగర్ ఎడమ కాలువపై ఉన్న లిఫ్ట్‌లను మరమ్మతులు చేయకుండా నిర్వీర్యం చేసిందని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో సాగర్ లిఫ్ట్ ఇరిగేషన్ పని తీరుపై జిల్లా కలెక్టర్, అధికారులతో రైతుల సమక్షంలో ఏర్పాటు చేసిన విస్తృత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగర్ ఎడమ కాలువపై హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 35 లిఫ్టులు, నియోజకవర్గంలో 19 లిఫ్టులు ఉన్నాయన్నారు. వీటిలో పూర్తిస్థాయిలో పనిచేసే, పాక్షికంగా పనిచేసే, పూర్తిగా పని చేయని లిఫ్టుల వివరాలను నీటిపారుదల శాఖ అధికారులతో ఎల్ఈడి స్క్రీన్‌పై గణాంకాలను అడిగి తెలుసుకున్నారు. సగానికి పైగా లిఫ్టులు సామర్థ్యానికి అనుగుణంగా పని చేయకపోవడంపై అధికారులను కారణాలు చెప్పాలని సమావేశంలో ఆదేశించారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. ఈ సందర్భంగా అధికారులు తమ పనితీరును



మెరుగుపరుచుకోవాలని సూచించారు. సమస్యలను తన దృష్టికి తేవాలని లిఫ్టులు పూర్తి సామర్థ్యంతో పనిచేసేందుకు ప్రభుత్వం పక్షాన చర్యలు చేపడతానన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ల నిర్వహణలో రైతులపై భారం తగ్గించేందుకు లిఫ్టులపై సాంకేతిక సిబ్బంది ఎలక్ట్రీషన్, ఆపరేటర్, వాచ్మెన్, ఫిట్టర్ పోస్టులను ఔట్సోర్సింగ్ పద్ధతిలో నియమిస్తామన్నారు. వీరికి ప్రభుత్వమే వేతనాలు ఇస్తుందని చెప్పారు. అర్హతలను బట్టి అధికారులు లిఫ్ట్ కమిటీలు గతంలో పనిచేసిన వారినా లేదా కొత్త వారిని తీసుకోవాలా అన్న నిర్ణయం వారికే ఇస్తున్నామన్నారు. గతంలో సాగర్ ఎడమ కాలువ డిజైన్‌లో భాగంగా ఎడమ కాలువపై లిఫ్టులు లేవని తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నాటి కలెక్టర్ మనోహర్ ప్రసాద్‌తో కలిసి కృష్ణా నది ఒడ్డున ఉన్న గ్రామాలకు ఆర్టీసీ బస్సులో పర్యటించి లిఫ్ట్‌ల నిర్మాణానికి ఎంతో శ్రమించామన్నారు. మేజర్ ప్రాజెక్ట నిర్మాణానికి కోట్ల రూపాయల ఖర్చవుతుందని చిన్న లిఫ్ట్‌ల కింద ఆరు లక్షల ఎకరాల భూమి సాగుతుందని వీటి పనితీరు మెరుగుపరిచేందుకు రైతులు అధికారులు సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు. మొత్తం 34 లక్షల 460 ఎకరాలలో సాగునీరు అందాల్సి ఉండగా 25 లక్షల లోపు భూమికే నీరు అందుతుందని ఈ విషయంపై సమీక్షలో పరిష్కారం దొరకావాలన్నారు. జూలై మొదటి తేదీ నాటికి లిఫ్ట్‌లన్ని పూర్తి స్థాయిలో పని చేయాలన్నారు. చంద్రాల రేపల్లె అడ్లూరు పొనుగోడు వెలిదండరాయినిగూడెం మర్రిగూడెం రెడ్లకుంట లిఫ్ట్ ఇరిగేషన్లపై ఉన్న సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. కొత్త లిఫ్ట్ ఇరిగేషన్లకు నీటి వనరులను బట్టి రైతులు సహకరిస్తే తప్పకుండా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. చెరువులు అక్రమిస్తున్నట్లు వార్తలు అందుతున్నాయని ఎవరైనా చెరువులు అక్రమిస్తే కేసులు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంకట్రావు మాట్లాడుతూ తన 37 ఏండ్ల సర్వీసులో అన్ని శాఖలతో ఇంత చక్కటి సమావేశం నిర్వహించడం అభినందనీయం అన్నారు. మంత్రి ఆదేశాల మేరకు ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే పద్మావతి, చీఫ్ ఇంజనీర్ నాగేశ్వరరావు, హుజూర్‌నగర్ ఎస్ఈ నర్సింహారావు, ఈఈ లు సత్యనారాయణ, శ్రీనివాసరావు, ఆర్డిఓలు, మాజీ ఎమ్మెల్యే చందర్ రావు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు, రెవిన్యూ, నీటిపారుదల, ఐసిడిఎస్ అధికారులు పాల్గొన్నారు.

ప్రయివేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

తెలంగాణ పౌర స్పందన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కేప మంగ



నవతెలంగాణ-కోదాడరూరల్

ప్రయివేట్, కార్పొరేటర్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటు అయినాయని తెలంగాణ పౌర స్పందన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కెప మంగ అన్నారు. సోమవారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కరపత్రాలు పంపిణీ చేసి విస్తృత ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యా వైద్యం ప్రభుత్వ బాధ్యత అని ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు ప్రజా ప్రతినిధులు ఉద్యోగులు ఉపాధ్యాయులు అన్ని వర్గాల ప్రజలు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ విద్యారంగంతోనే రాజ్యాంగపరమైన హక్కులు సమాజానికి అందుతాయన్నారు. తెలంగాణ పౌర స్పందన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ బడులు నిలబడేందుకు సమరశీల ఉద్యమం చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షులు ఆర్ ధనమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రాంతీయ అధ్యక్షులు వి వెంకటరమణ, ఉపాధ్యక్షులు జి వెంకటరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం రంగారెడ్డి, జి వెంకటేశ్వర్ రెడ్డి, షేక్ ఖాజామీయా, డిఎస్ స్వామి, శేఖర్, హమీద్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై దృష్టి పెట్టాలి

భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యల్కా సోమయ్య గౌడ్

నవతెలంగాణ-మునగాల



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి యల్కా సోమయ్య గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం స్థానిక భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 2009 నుండి కార్డులు పొందిన కార్మికులకు ఆధార్ అప్డేట్ లేదని గుర్తుచేశారు. అప్డేట్ కొరకు హైదరాబాద్ వెళ్లాలని లేబర్ అధికారులు తెలియజేయడంతో చేసేది ఏమీ లేక కొంతమంది బోర్డు కార్యాలయాన్ని సంప్రదిస్తున్నారని చెప్పారు. మరి కొందరు హైదరాబాద్ వెళ్లలేక వచ్చే సంక్షేమ పథకాలకు అనర్హులుగా మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆధార్ అప్డేట్ లాగిన్ స్థానిక అసిస్టెంట్ లేబర్ అధికారులకు లాగిన్ ఇవ్వాలని సూచించారు. అలాగే తక్షణమే దళారుల వ్యవస్థను నిర్మూలించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బచ్చలకూర స్వరాజ్యం, మండల అధ్యక్షులు షేక్ దస్తగిరి ప్రధాన కార్యదర్శి మామిడి నా గేంద్రబాబు, పట్టణ అధ్యక్షులు అల్లి నా గరాజు, ఉపాధ్యక్షులు కోల ఆంజనే యులు, ఎస్కే సైదా, ఎం జాన్ పాషా, కనకయ్య, సుబ్బారావు, పాల్గొన్నారు.



భర్త ఆత్మహత్యకు కారణమైన భార్య, బంధువుల అరెస్టు

నవతెలంగాణ హుజూర్‌నగర్

ఈ నెల 8న భర్త ఆత్మహత్యకు కారణమైన భార్య, ఆమె బంధువులను అరెస్టు చేసినట్టు సీఐ చరమంద రాజు తెలిపారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. హుజూర్‌నగర్ పట్టణంలో పద్మశాలి బజారుకు చెందిన రంజిత్ కుమార్ 14 ఏండ్ల క్రితం శ్రీనివాసపురం గ్రామానికి చెందిన స్వప్నను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఇటీవల ఆమె వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం ఏర్పరుచుకోవడంతో తరచూ గొడవలు జరిగి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలియజేశారు. వీరికి ఇద్దరు కుమార్తెలు వర్షిత(12) జశ్విత(9) ఉన్నారు. సీతారాంపురం కాలనీలో రేషన్ డీలర్ షిప్ రావడంతో స్వప్న వంగర లింగయ్య ఇంటిని అద్దెకు తీసుకొని షాపు నడుపుతోంది. రంజిత్ కుమార్ ఫోటోగ్రాఫర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆరు నెలల క్రితం రంజిత్ కుమార్ కులస్తుడైన మీట్ట కోలు దుర్గాప్రసాద్‌తో స్వప్నకు పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం వివాహేతర సంబంధంగా మారింది. ఆ తదుపరి భర్త రంజిత్ కుమార్‌కు తెలియకుండా స్వప్నను దుర్గాప్రసాద్ తిరుపతి తీసుకెళ్లాడు. అనంతరం ఈ విషయమై గొడవలు జరిగాయి. మృతుడు పలుమార్లు హెచ్చరించినా భార్య ప్రవర్తనలో మార్పు రాలేదు. నెల రోజుల క్రితం తన చావుకి భార్య స్వప్న, అత్త నాగమణి, బామ్మర్ది చంద్రశేఖర్ కారణమని సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. అది చూసి ఎందుకు తీసావ్ అని భార్య, బావమరిది చంద్రశేఖర్ కొట్టి ఇంటి నుండి వెళ్లగొట్టారు. అనంతరం మృతుడు మఠంపల్లిలోని తన బావ కుర్షీద్ రెస్టారెంట్లో పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈనెల 7వ తేదీన సీతారాంనగర్‌కు తన కూతురును చూడడం కోసం వెళ్లగా భార్య గొడవ పడి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. 8వ తేదీన రంజిత్ కుమార్ తన ఇంట్లో ఉరేసుకొని చనిపోయాడు. భార్య స్వప్న, ఆమె తల్లి నాగమణి, అన్న చంద్రశేఖర్ ,మిట్ట కోలు ప్రసాద్‌పై మృతుని తల్లి చిట్టిబోలు పద్మ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. దీంతో వారిని అరెస్ట్ చేసినట్టు సీఐ మీడియాకు తెలిపారు. వారి వెంట ఎస్సై ముత్తయ్య ఉన్నారు.

30న జాతీయ శతాధిక కవి సమ్మేళనం

నవతెలంగాణ-సూర్యాపేట

ఈ నెల 30న పట్టణంలోని సాయి బాలాజీ ఫంక్షన్ హాల్ జాతీయ శతాధిక కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు శ్రీశ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షులు పోతుగంటి వీరాచారి తెలిపారు. సోమవారం స్థానిక మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ప్రముఖ కవి, పాత్రికేయులు డేగల జనార్దన్ చేతుల మీదుగా నిర్వహించిన పోస్టర్ ఆవిష్కరణలో ఆయన మాట్లాడారు. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయచైర్మెన్‌డా కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో సూర్యాపేటలో నిర్వహించబోయే 136వ జాతీయ శతాధిక కవి సమ్మేళనం కార్యక్రమానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని కవులు, కళాకారులు, రచయితలు తమ పేర్లను నమోదు చేసుకొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గుండెపురి ఉపేంద్రాచారి, ప్రధాన కార్యదర్శి లింగాల కవితా శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు తూపురాణి వేంకట కృష్ణమాచార్యులు , కన్వీనర్ ఎస్.కె హమీద్ ఖాన్, మహిళా అధ్యక్షురాలు పూసోజు పద్మ ప్రధాన కార్యదర్శి నల్లగొండ జ్వాలా గిరీష్, సహాయ కార్యదర్శి కుమారి శ్రీపాద అర్చనాదేవి, కార్యదర్శి శ్రీ దురుసోజు శ్రీనివాసాచారి, ప్రముఖ కవి, గేయ రచయిత ఆవుల వీరభద్రం, హలీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ డైరెక్టర్‌కు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-కోదాడరూరల్

అనంతగిరి మండలం బొజ్జగూడెం తండ గ్రామానికి చెందిన అనంతగిరి సొసైటీ డైరెక్టర్ గుగులోతు రాము గత 20 రోజుల క్రితం లారీ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న మాజీ శాసన సభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ సోమవారం రాముని పరామర్శించి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అయన వెంట గుగులోతు శ్రీనివాస్, దారావతు హుస్సేన్ నాయక్, గుగులోతు రామారావు, సైదులు, రామకృష్ణ, వసరాం, భూక్యా సింగు, బానోతు సక్రు ఉన్నారు.

సీని రంగంలో కోదాడ వాసులు రాణించడం అభినందనీయం

- ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతిరెడ్డి

నవతెలంగాణ-కోదాడరూరల్

సీని రంగంలో కోదాడ వాసులు రాణించడం అభినందనీయమని ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి అన్నారు. సోమవారం పట్టణంలో శ్రీ రాఘవేంద్ర స్వామి ఆర్ట్ క్రియేషన్ బ్యానర్‌పై నిర్మాతలు బుడిగం నరేష్, రుద్దనేని శ్రీనివాస్‌లు సర్కార్ శివ టైటిల్‌తో నిర్మిస్తున్న చిత్రం షూటింగ్‌ను ఎమ్మెల్యే క్లాప్ కొట్టి ప్రారంభించి మాట్లాడారు. నిర్మాతగా, నటునిగా బుడిగం నరేష్ మంచి చిత్రాలతో సినీరంగంలో పేరు తెచ్చుకోవాలని అన్నారు. నూతనంగా నిర్మిస్తున్న సర్కార్ శివ చిత్రం విశేష ప్రేక్షక ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు కాసాని శివ, నటీనటులు బుడిగం నరేష్ ,ప్రభాకర్ రావు, ఓరుగంటి శ్రీనివాస్ రెడ్డి, హీరోయిన్ శృతి, సైదులు, కమతం వెంకటయ్య చిత్రం యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.





ఎమ్మెల్యే సమక్షంలో ఐఎన్‌టీయూసీలో చేరిన మెప్మా ఆర్పీలు

పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి సమక్షంలో మున్సిపాలిటీ పరిధిలోని మెప్మా ఆర్పీలు కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘం ఐఎన్‌టీయూసీలో సోమవారం చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని ప్రమీల రమేష్, వైస్ చైర్మెన్ కందుల కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ పార సీతయ్య, వార్డు కౌన్సిలర్ గంధం యాదగిరి, స్వామి నాయక్, సైదా నాయక్, సంఘ అధ్యక్షురాలు షేక్ పర్వీన్, ఉపాధ్యక్షురాలు పొక్కుల నాగమణి, కార్యదర్శి ఎగ్గడి మాధవి, సహాయ కార్యదర్శి షేక్ హసీన నూరి, కోశాధికారి తేజవత్ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగ్స్ పంపిణీ..

మున్సిపాలిటీ పరిధిలోని 25వ వార్డులో బాబా అధ్వర్యంలో ఏర్పాటు చేసిన బ్యాగ్స్ పంపిణీలో ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతిరెడ్డి చేతుల మీదుగా సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు మంచిగా చదవాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, కౌన్సిలర్ షేక్ మదార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఏ మోడల్ హై స్కూల్ ప్రారంభం

సోమవారం పట్టణంలోని బస్టాండ్ పక్క వీధిలో ఎమ్మెస్ కళాశాలరోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎంఏ మోడల్ హై స్కూల్ పాఠశాలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఉన్నత ప్రమాణాలు కలిగిన ఈ పాఠశాలను విద్యార్థుల తల్లిదండ్రులు ఆదరించాలన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ షేక్ సులేమాన్ మాట్లాడుతూ నర్సరీ నుండి పదవ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియంలో అనుభవాజ్ఞులైన ఉపాధ్యాయులతో ఉత్తమ బోధనను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మౌలానా మహమ్మద్ అబ్దుల్ ఖాదిరి సాహెబ్, రషీద్ మాజీ కౌన్సిలర్ షమ్మి, మౌలానా అతహర్, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు సంక్షేమ పథకాలు అందించాలి

నవతెలంగాణ-కోదాడరూరల్

రాష్ట్రంలో వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కౌలు రైతులకు రైతు భరోసా, పండించిన పంటలకు బోనస్, పంట బీమా వంటి పథకాలు అమలు చేసేందుకు ప్రభుత్వం వెంటనే విధి విధానాలు రూపొందించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పాశ్య పద్మ అన్నారు. సోమవారం పట్టణ పరిధిలోని తమ్మరలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన రైతులు, కౌలు రైతుల అవగాహన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రెవెన్యూ వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి వాస్తవంగా సాగు చేసే కౌలు రైతులను గుర్తించి 2011 చట్టం ప్రకారం గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం రైతులతో పాటు కౌలు రైతులకు రైతు భరోసా నిధులు ఇచ్చి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి కొప్పోజు సూర్యనారాయణ, కౌన్సిలర్లు సామినేని నరేష్, బత్తినేని హనుమంతరావు, కనగల రాధాకృష్ణ, రైతు సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లు ప్రసాద్, తుమాటి రామయ్య, మాతంగి ప్రసాద్, కనగల శేషగిరి, పూర్ణ, హరికృష్ణ, ప్రసాద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
యాదాద్రి భువనగిరి
మంగళవారం | జూన్ 11, 2024 | www.navatelangana.com

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ప్రారంభించాలి



నవతెలంగాణ-భువనగిరి అర్బన్

భువనగిరిలోని సింగన్నగూడెంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ప్రారంభించాలని లబ్దిదారులు సోమవారం భువనగిరి తహశీల్దార్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మౌలిక వసతులైన మంచినీరు, కరెంటు, డ్రైనేజీ రోడ్లకు మరమ్మతులు చేసి లబ్ధిదారులకు కేటాయించిన ఇండ్లలో గృహప్రవేశాలు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో డబల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు చేగురి సుధాకర్, కొత్త సత్యం, బరిగేశంకర్, కాలేరు శివశంకర్, భామిని మంజుల, శ్రీదేవి, రేవతి, తాడియా బద్రి, రచ్చ సాయి భాస్కర, అజర్, రోహిణి, రవి, ఉప్పలంచి శశిరేఖ పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం అందక రైతన్నల ఇబ్బందులు

నవతెలంగాణ-మోటకొండూర్



వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో రైతులు వ్యవసాయ పనులు మొదలుపెట్టారు. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో పత్తి విత్తనాలు విత్తుతున్నారు. మృగశిర కార్తె ప్రారంభం కావడంతో రైతులు వరినారు పోసుకుంటున్నారు. కానీ ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు రైతు భరోసాపై ఎటువంటి ప్రకటన చేయలేదు. కనీసం విధివిధానాలు రూపొందించకపోవడంతో రైతుల్లో అయోమయం నెలకొంది. రైతు బంధు సాయం కోసం రైతులు చాలా పాట్లు పడుతున్నారు. పోయిన విడతలో చేసిన విధంగా కాకుండా రైతుకు అవసరపడే సరైన సమయంలో రైతు భరోసా సాయం ఒక్కసారే విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

జిల్లాలో 665 ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు

- బదిలీల తర్వాత ఖాళీలు మరింత పెరిగే అవకాశం
- విద్యాలయాల మరమ్మతులకు రూ.25 కోట్లు
- అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు

నవతెలంగాణ భువనగిరి

యాదాద్రి భువనగిరి జిల్లాలో 665 ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు ఉన్నాయి. ఈ ఖాళీలు వివిధ స్థాయిలో సిబ్బంది బదిలీలు కానుండడంతో మరింత పెరిగే అవకాశం ఉంది. జిల్లాలో మొదట ప్రధాన ఉపాధ్యాయులు, అనంతరం సీనియర్ అసిస్టెంట్లు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు స్కూల్ అసిస్టెంట్‌గా ప్రమోషన్లు పొందనున్నారు. అనంతరం వారి బదిలీలు జరుగుతాయి. ఎన్నికలకోడ్ నిబంధన జిల్లాలో ఉండడంతో బదిలీలకు ఆలస్యం జరిగింది. సుమారు 70 మంది ప్రధానోపాధ్యాయులుగా ప్రమోషన్ వచ్చే అవకాశం ఉంది. సీనియర్ అసిస్టెంట్లు 8, 9 షెడ్యూల్ కింద వారికి ప్రమోషన్లు రానున్నాయి. జిల్లాలో గవర్నమెంట్‌లో పాఠశాలలో ప్రమోషన్లు లిస్ట్ తయారయింది. జిల్లా పరిషత్ పాఠశాలలు ప్రమోషన్లు పెండింగ్లో ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలలో జిల్లా పరిషత్ పాఠశాలల మధ్య ఉన్న వివాదంతో జిల్లా వ్యాప్తంగా మండల విద్యాధికారి పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

జిల్లాలో 712 ప్రభుత్వ పాఠశాలలు

జిల్లాలో 481 ప్రాథమిక పాఠశాలలు, 68 ప్రాథమికోన్నత



పాఠశాలలు, 163 హైస్కూల్ పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో స్థానిక పాఠశాలలో 38,561 మంది విద్యార్థులు కస్తూరి విద్యాలయాలలో 2,719 మంది విద్యార్థులు, మోడల్ స్కూల్లో 4,294 మంది మొత్తము 47,931 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఇవేకాక రెసిడెన్షియల్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ హాస్టల్స్, సొసైటీ పాఠశాలలు, ఆదర్శ పాఠశాల ఉన్నాయి. ప్రభుత్వం పాఠశాలల్లో 3465 పోస్టులు ఉండవలసి ఉండగా రెండు వేల ఎనిమిది వందల ఇరవై మంది పనిచేస్తున్నారు. 665 ఖాళీలు ఉన్నాయి.

పాఠశాలల అభివృద్ధికి రూ.25 కోట్లు మంజూరు

పాఠశాలల అభివృద్ధికి జిల్లాకు రూ.25 కోట్లు మంజూరయ్యాయి. పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా మంచినీటి సౌకర్యం, భవనాలు, ప్రహరీ గోడలు మరమ్మతులు, విద్యుత్ మరమ్మతులు, అధునాతన మూత్రశాలలు ఏర్పాటు కానున్నాయి.

అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు

విద్యా కమిటీల ఆధ్వర్యంలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు ఏర్పడనున్నాయి. పాఠశాలలకు అత్యంత సమీపంలో ఉండే సమభావన సంఘాల అధ్యక్షులు ఈ కమిటీలకు అధ్యక్షులుగా వ్యవహరిస్తారు. వీరు పాఠశాల అభివృద్ధికి సహకరిస్తూ తగు సూచనలు చేస్తారు.

పాఠ్యపుస్తకాలతో పాటూ నోటు పుస్తకాలు

ప్రభుత్వ పాఠశాలకు 90శాతం పుస్తకాలు అందాయని మిగతావి రెండు రోజుల్లో రానున్నాయి. పుస్తకాలతో పాటూ నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్నారు. 6వ తరగతికి, 7వ తరగతికి ఆరు నోట్ పుస్తకాలు, 8వ తరగతికి నోటు పుస్తకాలు, 9వ తరగతి వరకు 14 నోటు పుస్తకాలు అందిస్తున్నట్లు తెలిపారు.

తెలుగు, ఆంగ్ల భాషల్లో బోధన

ప్రభుత్వ పాఠశాలలో తెలుగు మీడియం, ఇంగ్లీష్ మీడియం బోధనలు ఉంటాయని డీఈవో నారాయణరావు తెలిపారు. టెక్స్ పుస్తకాలు హైస్కూల్ విద్యార్థులకు మొదటి విభాగం, రెండో విభాగం కింద అందిస్తామన్నారు. విద్యార్థులపై మానసిక ఒత్తిడి లేకుండా సకాలంలో పాఠ్యాంశాలను విద్యార్థులకు బోధిస్తామని తెలిపారు. విద్యతో పాటు విద్యార్థుల్లో మానసిక ఉల్లాసానికి క్రీడా సాంస్కృతిక కార్యక్రమాలు, పాఠశాలల్లో ఉంటాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో గతంలో కంటే ఉత్తీర్ణశాతం పెరగడంతో పాటు కార్పొరేట్ స్థాయిలో మార్కులు సాధిస్తున్నారని తెలిపారు.



తీన్మార్ మల్లన్నను కలిసిన నాయకులు

నవతెలంగాణ-తుర్కపల్లి

నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా విజయం సాధించిన తీన్మార్ మల్లన్నను సోమవారం తుర్కపల్లి మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎరుకల వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి హైదరాబాద్‌లోని క్యూ న్యూస్ కార్యాలయంకు శుభాకాంక్షలు తెలియజేయజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ దత్తాయపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు దేవరుప్పల మల్లేశ్, ఓబీసీ సెల్ జిల్లా కో ఆర్డినేటర్ దేవరుప్పల ఐలయ్య, మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గుంటి మల్లేశ్ యాదవ్, సీనియర్ నాయకుడు ధానబోయిన మల్లేషం, పాల ఉత్పత్తి దారుల సంఘం చైర్మెన్ జిట్ట కిషన్ యాదవ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు దానబోయిన నవీన్ బూత్ అధ్యక్షుడు గాజె మల్లేశం, గ్రామశాఖ ఉపాధ్యక్షుడు కోడారి పర మేష్ యాదవ్ ఉన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-రాజాపేట

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1969-70 విద్యా సంవత్సరంలో ఎస్ఎస్సీ బ్యాచ్ చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం రెండోసారి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జాల గ్రామానికి చెందిన ఠాగూర్ నర్సింగ్ బస్ సింగ్ ఇంటి వద్ద జరిగిన గృహప్రవేశ శుభకార్యంలో 54 సంవత్సరాల తర్వాత రెండోసారి పూర్వ విద్యార్థులు ఒకచోట కలిశారు. 31 మంది బ్యాచ్ లో విద్యార్థులు ఉండగా 24 మంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ఒకే కుటుంబ సభ్యుల లాగా కలసి సంతోషంగా గడిపి ఇతరులకు ఆదర్శమయ్యారు. ఈ బ్యాచ్ కు చెందిన పూర్వ విద్యార్థి బల్ల దామోదర్ మాట్లాడుతూ రెండోసారి తమ స్నేహితులను కలుసుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. తోటి స్నేహితుల జ్ఞాపకం గా ఠాగూర్ నర్సింగ్ బస్సింగ్ కు ప్రత్యేక గిఫ్టును అందజేశారు.

ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు మానుకోవాలి

- మాజీ వార్డ్ సభ్యులు కూరెళ్ల ఉప్పలయ్య

నవతెలంగాణ-మోత్కూర్

ఎమ్మెల్యే మందుల సామేల్‌పై సోషల్ మీడియాలో ప్రతిపక్ష నాయకులు చేస్తున్న అసత్య ఆరోపణలు మానుకోవాలని మోత్కూర్ గాంధీనగర్ కాలనీ మాజీ వార్డు మెంబర్, కాంగ్రెస్ నాయకులు కూరెళ్ల ఉప్పలయ్య అన్నారు. ఈ సందర్భంగా అయన విలేకర్లతో మాట్లాడుతూ జాజిరెడ్డిగూడెం, వంగమర్తి నుండి ఇసుక రవాణా చేస్తున్నారనేది అవాస్తవమని, అక్కడనుండి ఇసుకను ప్రభుత్వ అనుమతితోనే యాదాద్రి థర్మల్ ప్లాంటు, ఖమ్మం మున్నేరు వాగు సేఫ్టీ వాల్ నిర్మాణానికి కావలసిన ఇసుకను ఇక్కడి నుండి తీసుకు వెళుతుండడం వాస్తవమని,అది తెలియని కొందరు వ్యక్తులు ఎమ్మెల్యే పై వారి ఇష్టం వచ్చిన రీతిలో అసత్య ప్రచారాలు మనకుంటే ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు.

పిడుగుపాటుకు ఆవు మృతి

నవ తెలంగాణ-రాజాపేట

మండలంలోని బేగంపేట గ్రామంలో సోమవారం సాయంత్రం పిడుగుపాటుకు పాడి ఆవు మృతి చెందింది. భారీ ఉరుములు మెరుపుల వర్షంతో పాటు పిడుగు పడడంతో మూల సాయిలు అనే రైతుకు చెందిన పాడి ఆవు వ్యవసాయ పొలంలో మృతి చెందింది. సుమారు 60 వేల రూపాయల విలువైన పాడి ఆవు మృతి చెందడంతో రైతుతోపాటు కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానిక నాయకులు కోరుతున్నారు.

జిల్లాలో భారీ వర్షం

నవతెలంగాణ-భువనగిరి

యాదాద్రి భువనగిరి జిల్లాలోని భువనగిరి పట్టణంతోపాటు పలు మండలాలలో సోమవారం సాయంత్రం ఐదు గంటలనుండి ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో విద్యుత్తును తీసివేశారు. భువనగిరి పట్టణంలో గత ఎన్నికల ముందు మున్సిపల్ ఇంజనీర్లు సరిగా ప్రణాళిక తయారు చేయకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేయడంతో పలు ప్రాంతాలు లోతట్టు ప్రాంతాలుగా మారాయి. జంఖానా గుడా, కోర్టు, వినాయక చౌరస్తా వద్ద పెద్ద ఎత్తున నీరు నిలిచి జలమయమయ్యాయి. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిగాయి. ఈ ప్రాంతం గుండా వెళ్లే రైళ్ల వేగం తగ్గించడంతో రైళ్లు ఆలస్యంగా నడిచాయి. ఇటీవల కురిసిన తేలికపాటి వర్షాలతో చిన్న చిన్న కుంటల్లోకి నీరు వచ్చి చేరింది. భూగర్భ జలాలు పెరిగాయి. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ మరమ్మతుల చేస్తున్న కారణంగా విద్యుత్కు అంతరాయం కలిగింది సాయంత్రం వర్షం వల్ల మరో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది.

శిఖం భూముల కబ్జాలను అరికట్టాలి

- మత్స్యపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు కందుల హనుమంతు
- తహసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

నవతెలంగాణ-రామన్నపేట

మండల వ్యాప్తంగా ఉన్న చెరువులు, కుంటల శిఖం భూములు ఎథేచ్ఛగా కబ్జా అవుతున్నాయని వాటిని అరికట్టాలని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు కందుల హనుమంతు అన్నారు. సోమవారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం తహసిల్దార్ లాల్ బహదూర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం కందుల హనుమంతు మాట్లాడుతూ శిఖం భూములను కాపాడండి చెరువు, కుంటల చుట్టూ హద్దురాలను నాటి ఫినిషింగ్ చేయాలని, కబ్జాదారులపై చట్టపరమైనటువంటి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కరువుతో మత్స్యకారులకు చెరువులో నీళ్ల లేక జీవనం కరువై బతుకు భారం అయిపోతుందన్నారు. భూ కబ్జాదారుల చర నుండి భూమిని కాపాడి మత్స్య కారులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. కబ్జాల విషయమై అధికారులకు అనేకమార్లు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదని ఆయన ఆరోపించారు. భవిష్యత్తులో అధికారులు స్పందించని పక్షంలో పెద్ద



ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. కాగా ఈ వినతి పత్రాన్ని సంబంధిత శాఖ అధికారులకు పంపించి కబ్జాలను అరికట్టడానికి కృషి చేస్తామని తహసిల్దార్ ఈ సందర్భంగా హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి పిట్టల మత్స్యగిరి, డైరెక్టర్ కందుల శ్రీను, రేపాక రాజు, మాజీ ఉపాధ్యక్షులు యట ఇస్తారి, మాజీ డైరెక్టర్ సాధుల యాదగిరి, బచ్చ రాములు, కందుల హరీష్, జినుకల చిన్న మల్లయ్య, మహిళా మచ్చ సొసైటీ కార్యదర్శి కందుల కలమ్మ, పోచమ్మ, కందుల పద్మ, యాట అనసూయ, కందుల లక్ష్మి, బోళ్ల వెంకన్న, పిట్టల మణికంఠ, బోళ్ల సైదులు, కందుల మనీ, జవ్వాజి శ్రీకాంత్, కందుల సత్తయ్య కందుల వెంకటేశం సత్తమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి



- జిల్లా కలెక్టర్ హనుమంతు కే జెండగే

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి ద్వారా ప్రజలు అందించిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హనుమంతు కే జెండగే జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుండి 40 ఫిర్యాదులను స్వీకరించారు. రెవెన్యూ శాఖ 30, మున్సిపాల్ శాఖ 5, విద్యాశాఖ 3, పోలీసు, కార్మిక శాఖలు ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తును పరిశీలించి త్వరగా పరిష్కరించాలని, అమ్మ ఆదర్శ పాఠశాలలకు చెందిన మిగిలి ఉన్న పనులను త్వరగా పూర్తి చేసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎంఏ కృష్ణన్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శోభారాణి,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ, కలెక్టరేట్ పరిపాలనాధికారి జగన్మోహన్ ప్రసాద్ పాల్గొన్నారు.

వికలాంగుల పెన్షన్ రూ.6 వేలకు పెంచాలి

- సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్

నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్

వికలాంగుల పెన్షన్ రూ.6 వేలకు పెంచాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ వనం ఉపేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం చౌటుప్పల్ డివిజన్ ఆఫీస్ బేరర్స్ సమావేశం అధ్యక్షులు తుంగ భూపాల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి 6 నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఇచ్చిన హామీని నెరవేర్చలేదని, వెంటనే ఇచ్చిన హామీని అమలు చేయాలనీ రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి ఏర్పుల శివయ్య చౌటుప్పల్ మండల అధ్యక్షులు సంజీవ శంకర్ మండల ప్రధాన కార్యదర్శి రాయగిరి యాదగిరి చౌటుప్పల్ టౌన్



నర్సిరెడ్డి యాదమ్మ పోచపల్లి మండల్ అధ్యక్షులు ముదిగొండ రాములు తదితరు పాల్గొన్నారు.

సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ప్రజా సంఘాల మండల కన్వీనర్ మైలారం జంగయ్య



నవతెలంగాణ-బొమ్మలరామారం

సైబర్ మోసాల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ప్రజా సంఘాల మండల కన్వీనర్ మైలారం జంగయ్య, మండల ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కోఆర్డినేటర్ ఎల్లబోయిన విశ్వనాథ్‌లు అన్నారు. సోమవారం మండలంలోని రంగాపూర్ గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కీసర ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఫోన్ ద్వారా ఓటిపి, ఆధార్ నెంబర్ అడిగి ప్రజల ఖాతాల్లో ఉన్న డబ్బును దొంగలిస్తున్నారన్నారు. లాటరీ తగిలిందని ఫోన్లో మెసేజ్‌లు పెడుతూ ప్రజలను మోసగిస్తున్న సైబర్ మోసగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, జీవనజ్యోతి, అటల్ పెన్షన్ యోజనలాంటి పథకాలన్నీ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజల్లో ఆర్థిక అక్షరాస్యత పై అవగాహనను పెంపొందించడానికి, ఆర్థిక మోసాలను అరికట్టడానికి, ఆర్థిక మోసాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించారు. ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరికి బ్యాంకుల పట్ల అవగాహన కల్పించేందుకు ఎస్ఎస్‌టీ (సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్) ఎన్జీవో ద్వారా ప్రజలకు ఉచితంగా సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, నరసింహ, మల్లేష్, భార్గవి, లావణ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి

- అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ మారుపల్లి జ్యోతి

నవతెలంగాణ-ఆలేరుటౌన్



బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ మారుపల్లి జ్యోతి కోరారు. బడిబాటలో భాగంగా మండలంలోని గొలనుకొండ గ్రామంలో సోమవారం పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులతో కలిసి, గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని గ్రామంలోని ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు గౌసియా జానీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పచ్చిపాల మల్లయ్య, పిఎస్ పాఠశాల, ప్రధానోపాధ్యాయులు రాజ్ కుమార్ పాల్గొన్నారు.

అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ తరలింపును నిలిపివేయాలి

ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు మంగ ప్రవీణ్



నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ తరలింపును నిలిపివేయాలని భారత జాతీయ విద్యార్థి సంఘం ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు మంగ ప్రవీణ్ విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ కార్యాలయం పరిపాలన అధికారి జగన్ మోహన్ ప్రసాద్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంగ ప్రవీణ్ మాట్లాడుతూ అర్బన్ ప్రాంతంలో కొనసాగించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌ని అందులో పని చేస్తున్న కొంతమంది సిబ్బంది యొక్క స్వార్థ ప్రయోజనాల కోసం గత ప్రభుత్వ సిఫారసు మేరకు తరలింపును చేపట్టడం అసమంజసమని అన్ని విధాల విద్యార్థులకు సిబ్బందికి సౌకర్యంగా ఉండే జిల్లా కేంద్రంలోని ఈ యొక్క పాఠశాలను నిర్వహించాలని అన్నారు అధికారులు కలెక్టర్ సంబంధిత డీఈఓ వెంటనే స్పందించి తరలింపును నిలుపుదల చేయాలని కోరారు.

విద్యుద్ఘాతంతో మేక మృతి

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

విద్యుద్ఘాతంతో మేక మృతి చెందిన ఘటన మండలంలోని ఆకుతోటబావి తండాలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కెతావత్ పుల్ సింగ్ దిన చర్యలో భాగంగా మేకలు కాస్తూ వెళుండగా కెతావత్ సుధాకర్ పొలం వద్ద గల కెతావత్ నరసింహ, కెతావత్ సుధాకర్‌కి చెందిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ వైరు తెగి ఉండడంతో అటు వైపుగా వెళ్లిన ఒక మేక విద్యుత్ ఘాతుకానికి గురై మృతి చెందినట్లు కాపరి కెతావత్ పుల్ సింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. మృతి చెందిన మేక విలువ సుమారుగా రూ.18,000 ఉంటుందని నష్ట పరిహారంగా విద్యుత్ శాఖ ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

'ఆరు గ్యారంటీలను అమలుపరచాలి'

నవతెలంగాణ-భువనగిరి అర్బన్



ప్రభుత్వం తలపెట్టిన ఆరు గ్యారంటీలను పథకములను అమలు పరచాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఏవి కిరణ్ రచ్చ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలను ఆన్లైన్ చేసి లబ్ధిదారులకు న్యాయం చేయాలను కోరుతూ మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డికి బీఆర్ఎస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఎన్నికల కోడ్ ఉన్నందున దరఖాస్తులను నిలిపివేశారనిన్నారు. లబ్ధిదారులు దరఖాస్తు చేసుకునేందుకు మున్సిపల్ కార్యాలయంలో ఉన్న కౌంటర్లను తిరిగి పున ప్రారంభం చేయాలన్నారు. ప్రజలకు ఇచ్చిన పథకాలను అమలు పరచకపోతే ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ తాడూరు బిక్షపతి, గుండెబోయిన సురేష్ యాదవ్, సిరిపంగా సుభాష్ హరికిషన్ పాల్గొన్నారు.

'కోళ్ల కమలమ్మ సేవలు ప్రశంసనీయం'

నవతెలంగాణ-ఆలేరుటౌన్

సీపీఐ సీనియర్ నాయకులు కోళ్ల కిషన్ సతీమణి కోళ్ల కమలమ్మ సీపీఐ పార్టీకి చేసిన సేవలు ప్రశంసనీయమని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేష్ అన్నారు. కోళ్ల కమలమ్మ(80) సోమవారం తెల్లవారుజామున హైదరాబాదులో అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందారు.మృతదేహాన్ని మండలంలోని స్వగ్రామమైన కొలనుపాకకు తీసుకురావడంతో సీపీఐ మండల, పట్టణ కమిటీలు ప్రగాఢ సానుభూతి సంతాపం తెలియజేస్తూ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి పోతు ప్రవీణ్, కృష్ణా,నందు ,దయానంద, నరేష్, రవి, పరశురాములు, ఆంజనేయులు సిపిఐ పార్టీ సభ్యులు గ్రామస్తులు అధిక సంఖ్యలో నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

వేములవాడలో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-ఆలేరుటౌన్

మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య జన్మదినం పురస్కరించుకొని సోమవారం సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ రాజరాజేశ్వర స్వామిని సేవలో ఆలేరు మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య దంపతులు పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోత్రనామాలతో అభిషేకం చేశారు. ప్రత్యేక దర్శనం అనంతరం శ్రీ రాజారాజేశ్వరి సన్నిధిలో కోడె మొక్కును చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైర్మన్ శంకరయ్య మాట్లాడుతూ ఆలేరు మున్సిపల్ పరిధిలోని ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, యువత చెడు మార్గం పట్టకుండా, మంచిగ చదువులపై దృష్టి సారించాలని, ఉద్యోగాలు పొందేందుకు కృషి చేస్తూ మంచి మార్గాన్ని ఎంచుకోవాలని కోరుతూ శ్రీ రాజారాజరాజేశ్వర స్వామిని కోరుకున్నట్లు తెలియజేశారు.

ఘనంగా తిరుమలేష్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-రాజాపేట

మండల కేంద్రానికి చెందిన రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సట్టు తిరుమలేశ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన నివాస గృహంలో పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, జర్నలిస్టులు, అభిమానులు, వివిధ పార్టీల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రత్యేక ఆకర్షణగా చిన్నారి భరతనాట్యం

నవతెలంగాణ-రాజాపేట



మండల కేంద్రంలో నేస్తం ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవం ముగింపు సందర్భంగా చిన్నారి కాసోజు సంస్కృతి చేసిన భరతనాట్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నేస్తం సభ్యులలో ఒకరైన కాసోజు శ్రవణ్ రాధ దంపతుల కూతురు అయిన సంస్కృతి చేసిన భరతనాట్యం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతో పాటు పాల్గొన్న భక్తజనులందరి మన్ననలు పొందింది. భువనగిరికి చెందిన రమేష్ వద్ద భరతనాట్యం నేర్చుకుందని తల్లిదండ్రులు చెప్పారు. ఒకటో తరగతి జీనియస్ పాఠశాలలో చదువుతున్న ఈ చిన్నారి ప్రదర్శన అందరినీ ఆశ్చర్యానికి గురిచేసి శభాష్ అనిపించుకుంది. అర్చకులు సైతం ఆ కుటుంబ సభ్యులకు ప్రత్యేకంగా ఆశీర్వచనం చేశారు.

విశ్వనాథంచారి మృతి పట్ల సంతాపం

నవతెలంగాణ-ఆలేరుటౌన్

టీఏ, పీఆర్, పీఏ జిల్లా కమిటీ సభ్యులు విశ్వనాథం అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆయన మృతి పట్ల తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ సంఘం, యాదాద్రి భువనగిరి జిల్లా కార్యవర్గం సభ్యులు సంతాపం తెలిపి, నివాళులు అర్పించారు. నివాళులర్పించిన వారిలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మకంటి బాలరాజు, పోతుగంటి రాజయ్య, గోపరాజు లక్ష్మీనారాయణ, వీసం యాదగిరి, జి జగన్మోహన్, తదితరులు శ్రద్ధాంజలి ఘటిస్తు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ, సూర్యాపేట
యాదాద్రిభువనగిరి
మంగళవారం | జూన్ 11, 2024 | www.navatelangana.com

బాలు నాయక్‌కు మంత్రి పదవి ఇవ్వాలి

నవతెలంగాణ- చింతపల్లి



దేవరకొండ నియోజకవర్గం అభివృద్ధి కావాలంటే ఎమ్మెల్యే బాలునాయక్‌కు మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ యువజన నాయకులు కొప్పుల జంగయ్య గౌడ్ కోరారు. సోమవారం మండలంలోని ఎం మల్లెపల్లిలో నిర్వహించిన కల్లుగీత కార్మికుల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. గౌడ సంఘం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి నేనావత్ బాలు నాయక్ అని అన్నారు. దేవరకొండ వెనుకబడ్డ నియోజకవర్గమని బాలునాయక్‌కు మంత్రి పదవి ఇచ్చి వెనుకబడ్డ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే దిశగాగా చూడాలని కోరారు. దేవరకొండ నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే బాల్నాయక్ తోటే సాధ్యమనివారన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

ప్రభుత్వ వికలాంగుల బాలుర కళాశాల వసతి గృహములో ప్రవేశం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మహిళా, శిశు, దివ్యాంగుల, వయో వృద్ధుల శాఖ అధికారి బి. సక్కుబాయి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శారీరక దివ్యాంగులు, అంధులు, బధిరిలు (మూగ, చెవిటి) ఇంటర్మీడియట్ ఆపై (రెగ్యులర్) చదువులు చదివే వారు ఉమ్మడి నల్లగొండ జిల్లాకు సంబంధించి నల్లగొండ పట్టణంలో చదువు విద్యార్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. విద్యార్థులు దరఖాస్తుతో పాటు కళాశాలలో చెల్లించిన ఫీజు రశీదు, అంగవైకల్యం ధృవీకరణ పత్రం, బోనఫైడ్ సర్టిఫికేట్, (ప్రస్తుతము చదువుచున్న కళాశాల నుండి) ఆధార్ కార్డ్, కుల ధృవీకరణ పత్రం, అంగవైకల్యం సూచించే పాస్ పోర్ట్ సైజు ఫొటోలు 2, ఆదాయ ధృవీకరణ పత్రము, 10వ తరగతి మార్కుల మెమో తీసుకొని జిల్లా సంక్షేమ అధికారి మహిళా, శిశు, వికలాంగుల వయో వృద్ధుల శాఖ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు. లేదా వసతి గృహంలో సంప్రదించాలని తెలిపారు. లేదా వార్డెన్ గ్రేడ్-1 ప్రభుత్వ వికలాంగుల బాలుర కళాశాల వసతి గృహం, నల్లగొండ 9154759888 ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రైవేట్ ఆలోపతి, ఆయుర్వేద, హోమియో, ఆయుష్ క్లినిక్‌లు

తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి

- అగ్ని మాపక నియంత్రణ ప్రమాణాలు పాటించాలి
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా. కోటా చలం

నవతెలంగాణ-సూర్యాపేట

జిల్లాలో ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్‌అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ ఆలోపతి ఆసుపత్రులు,నర్సింగ్ హోమ్ లు, అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లు, డయగ్నిక్ సెంటర్లు, ఎక్స్ రే, డెంటల్, ఫిజియోథెరపీ సెంటర్లు ఆయుర్వేద, హోమియో, ఆయుష్ క్లినిక్కులు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో విధిగా రిజిస్ట్రేషన్ నమోదు చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా. కోటాచలం అన్నారు.సోమవారం స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి కార్యాలయములో నిర్వహించిన



సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. అగ్నిమాపక నియంత్రణ ప్రమాణాలు పాటించాలని లేకుంటే చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి ముందస్తు ఎటువంటి నోటీసు ఇవ్వకుండానే రూ.50,000/- ఫైన్ విధిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వాదేశాను సారము పైన తెలిపిన అన్నీ ప్రైవేట్ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్స్ లలో తప్పని సరిగా అగ్నిమాపక నియంత్రణ ప్రమాణాలు పాటించాలన్నారు.అిప్పటికీ అనుమతి లేని, అగ్నిమాపక నియంత్రణ సర్టిఫికేట్ లేని అన్ని ప్రైవేట్ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్స్ వారు తేదీ. 14.06.2024 వరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాల యంలో సమర్పించాలని పేర్కొన్నారు. కార్యాలయ ప్రతినిధులు సమాచారం కోరిన వెంటనే సహకరించి ఇవ్వగలరని కోరారు. పై నిబంధనలు అతిక్రమించిన చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎన్నికల కోడ్ ముగిసినా.. రిజిస్ట్రేషన్లు ప్రారంభించలే..



నవతెలంగాణ-చింతపల్లి

ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ధరణి వెబ్సైట్ లో భూమి కొనాలి అన్న అమ్మాలి అన్న, భూమి వేరే వాళ్లకు కుదపెట్టాలన్న రిజిస్ట్రేషన్ తప్పనిసరి. అయితే దానికి విరుద్ధంగా చింతపల్లి మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో వింత చోటు చేసుకుంది. ఎన్నిక కోడ్ ముగిసినా రిజిస్ట్రేషన్లు ప్రారంభించలేదు. మండలంలోని కుర్మేడ్డు గ్రామానికి చెందిన కురుమేటి శీను, జెల్లా నరసింహ వారికి చెందిన భూమి ఒకరికొకరు పట్టా చేసుకోడానికి వీలుండగా మండలంలోని తహసీల్దార్‌ను రిజిస్ట్రేషన్ కోసం కలిశారు. ఆయన మాత్రం నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. ఇదిలా ఉండగా ఎలక్షన్ కోడ్ అయిపోయిన తర్వాత వందల సంఖ్యలో రిజిస్ట్రేషన్ కోసం వేచి చూస్తున్నారని, ఒక్క డిజిటల్ సంతకం లేకపోతే ఇంత ఇబ్బందిగా గురవుతున్నామని పలువురు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా ధరణి కంప్యూటర్ ఆపరేటర్ రావడంలేదు. సమాచారం అడిగితే మా నానమ్మ చనిపోయిందని రావడంలేదని ధరణి ఆపరేటర్ అంటున్నాడు. అయితే తహసీల్దార్ మాత్రం తనకు ఏమీ తెలియదని , అసలు వెబ్సైట్ రావడం లేదని చెబుతున్నాడని ఆరోపిస్తున్నారు. తహసీల్దార్ పైసలిస్తే ఎంత పని అయినా చేస్తానని, డబ్బులు ఇవ్వకపోతే కొరివి పెడతాడని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.

తక్షణమే తహసీల్దార్‌ను సస్పెండ్ చేయాలి
బీజేపీ దళితమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు గాదరి జంగయ్య

తక్షణమే తాసిల్దార్ సస్పెండ్ చేయకపోతే ప్లాట్ బుకింగ్ చేసిన వాళ్ల ఎంతో ఇబ్బందులకు గురవుతున్నాడు. డబ్బులు ఇస్తే కోర్టు పరిధిలో ఉన్నటువంటి భూమి కూడా పట్టా చేసిన ఘనత తహసీల్దార్ విజయకుమార్‌కే చెందింది. ఇంటెలిజెన్స్ లో పనిచేసిన తహసీల్దార్‌కు గ్రామ ప్రజల బాధలు ఎలా తెలుస్తాయి. నిజానిజాలు తెలుసుకొని తహసీల్దార్ పై ఎంక్వయిరీ చేసి తక్షణమే సస్పెండ్ చేయాలి.

ఎలక్షన్ బిజీ ఉంది..ఇప్పుడు చేయమంటున్నారు..
కురుమేటి దాస్ శీను

ఎంపీ ఎలక్షన్లో స్లాట్ బుకింగ్ చేసిన తర్వాత ఇప్పుడు మేం రిజిస్ట్రేషన్ చేయమని తహసీల్దార్ అంటున్నాడు. ఎందుకు రిజిస్ట్రేషన్ చేయమని అడిగినప్పుడు మాకు ఎలక్షన్ బిజీ ఉంది ఇప్పుడు మేము చేయమని దురుసుగా మాట్లాడుతున్నాడు. తక్షణమే తహసీల్దార్‌ను బదిలీ చేసి ప్రజల బాగోగులు తెలిసే తహసీల్దార్‌ను నియమించాలి

ఎవరు ఇబ్బంది పడొద్దు... తప్పకుండా రిజిస్ట్రేషన్ చేస్తాం
తహసీల్దార్ పి.విజయ్‌కుమార్

సెలవులపై వెళ్లిన కంప్యూటర్ ఆపరేటర్ లేనందున, రిజిస్ట్రేషన్లు. చేయలేకపోయాం. కంప్యూటర్ ఆపరేటర్ లేనందున, మరొక ఆపరేటర్ రానందున, గతవారం నుంచి చేసుకున్నటువంటి స్లాట్ బుకింగ్‌లు డివైస్ లేనిది రిజిస్ట్రేషన్లు చేయలేకపోయాం. తప్పనిసరిగా తర్వాత రోజు నుంచి చేస్తాం.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని చర్యలూ చేపట్టాం

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర వెల్లడి



నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

ఋతుపవనాలు తెలంగాణ రాష్ట్రంలోకి ప్రవేశించి వర్షాలు పడుతున్న సందర్భంగా మాన్ సూన్ యాక్షన్ ప్లాన్ పై పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క ఆయా జిల్లాల అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా అధికారులకు పలు సూచనలు చేశారు. దోమలు పెరిగే ప్రాంతాల్లో ఫాగింగ్ చేయాలని, నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వైద్య ఆరోగ్య శాఖతో సమన్వయం చేసుకొని నీరు కలుషితం కాకుండా విష జ్వరాలు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను మంత్రి సీతక్క ఆదేశించారు. నల్గొండ జిల్లాకు సంబంధించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని రకాల చర్యలు చేపట్టామని, తాగునీరు డ్రైనేజీ నీరుతో కలవకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో మిషన్ భగీరథ సర్వే కొనసాగుతున్నదని, స్కూల్ పిల్లలకు మొదటి విడత యూనిఫార్మ్ పంపిణీ చేయడానికి అన్ని చర్యలు పూర్తయ్యాయని, రెండవ విడత యూనిఫామ్‌కి సంబంధించి ఇప్పటికే జిల్లాకు క్లాత్ వచ్చిందని, దానికి సంబంధించిన కుట్టు, పంపిణీని సైతం త్వరితగతిన పూర్తి చేస్తామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్డిఎ పిడి నాగిరెడ్డి, జెడ్పి సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి మురళి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ డి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధు వెంటనే ఖాతాలో జమ చేయాలి

- మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ: వానాకాలం రైతు బంధు తక్షణమే రైతుల ఖాతాలలో జమ చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ వానాకాలం వచ్చింది కానీ రైతులకు పంట పెట్టుబడి సహాయం గురించి కాంగ్రెస్ నోరు మెదపడం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వాన చినుకు పడితే రైతు బంధు పైసలు పడేవి అన్నారు. ప్రభుత్వం రైతు భరోసా డబ్బులు వెంటనే విడుదల చేసి షరతులు లేకుండా ఎకరాకు రూ.7500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల, రైతు సమస్యల పై దృష్టి సారించాలి ఆయన ప్రభుత్వానికి సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయాన్ని చిన్న చూపు చూస్తుందన్నారు.

అక్రమ దాడులను వెంటనే ఆపాలి

- గ్రామీణ వైద్యుల ధర్నా



నల్గొండ కలెక్టరేట్: నల్లగొండ జిల్లాలో గ్రామీణ వైద్యుల క్లినిక్లపై జరుగుతున్న అక్రమ దాడులు తక్షణమే ఆపి వేయాలని సుశృత గ్రామీణ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు హనుమంతరావు, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరాజు డిమాండ్ చేశారు. అక్రమ దాడులను, గ్రామీణ వైద్యులపై వేధింపులను ఆపాలని కోరుతూ సుశృత గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వంలో జీఓ.నెం.1273, 428, 429 ప్రకారం కమ్యూనిటి పారామెడిక్స్ కోర్స్ ట్రైనింగ్, జిల్లా ప్రభుత్వ వైద్యశాల, నల్లగొండలో ట్రైనింగ్ పూర్తి చేసినట్లు తెలిపారు. ఐఎమ్ఏ డాక్టర్స్ సర్వీసెస్ ఇవ్వలేనటువంటి మారుమూల ప్రాంతాలైన తండాలు, గూడాలు, అర్బన్ ఏరియాస్, మురికివాడలలో వైద్య సేవలందిస్తున్న గ్రామీణవైద్యులపై ఐఎంఎ వారికి సంబంధించిన ఎన్ఎంసీ, హెచ్ఆర్‌డిఏ, టిఎస్ఎంసి, కౌన్సిల్ నుండి విజిలెన్స్ అధికారులు దాడులు చేస్తున్నారన్నారు.ఇలాంటి దాడులు దేశంలో, ఏ రాష్ట్రంలో కూడా లేవని ఇప్పటికైనా తమపై దాడులను ఆపాలని, గ్రామీణ వైద్యులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో ఆ సంఘం నాయకులు డియస్ ఎస్.చారి, జి.నరసింహ రెడ్డి, మునీర్, సిహెచ్.దశరథ, కృష్ణారెడ్డి, సంగెపు మల్లేశ్, నేర్లకంటి రవి, తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారం : గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న ఆర్ఎంపీలకు చట్టభద్రత కల్పించాలని కోరుతూ సోమవారం మండలకేంద్రంలో ఆర్ఎంపీ వైద్యులు రాస్తారోకో నిర్వహించారు. వైస్సార్ ప్రభుత్వంలో ఆర్ఎంపీలకు ప్యారామెడికల్ శిక్షణ ఇప్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సీనియర్ ఆర్ఎంపీ పరాంకుశం, గౌరవాధ్యక్షులు దునక వెంకన్న, బండారు ధనుంజయ, మాదు వెంకన్న, అశోకా చారి, దామెర్ల శ్రీనివాస్, జెబ్బార్, దొనకొండ అంజయ్య, స్వామి, వీరాచారి,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-కేతేపల్లి

మండలంలోని కొర్లపాడు, గుడివాడ గ్రామాల్లో మృతుల కుటుంబాలను సోమవారం ఎమ్మెల్యే వేముల వీరేశం పరామర్శించారు. కొర్లపాడ్ గ్రామానికి చెందిన ఆవుదొడ్డి రాంబాయమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించగా దశదిన కర్మకు హాజరయ్యారు. చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేశారు. గుడివాడ గ్రామానికి చెందిన ఆలకుంట్ల శాంతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేశారు. ఈ ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గుత్తా మాధవరెడ్డి గుడివాడ గ్రామం మాజీ సర్పంచ్ షేక్ లతీఫ్ ,నాయకులు పాల్గొన్నారు.



చిన్నారులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-చింతపల్లి

సోమవారం మండలంలోని మాల్ గ్రామంలోని అమ్ములు ఫంక్షన్ హాల్ లో జరిగిన ఆడేపు రజిత - రావి గార్ల కుమార్తె,కుమారుల నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ హాజరై వారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భవాని పవన్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు నాగభూషణం, చింతపల్లి మాజీ సర్పంచ్ ముచర్ల గిరి,నియోజక వర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవ రెడ్డి,ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సంజీవరెడ్డి చిత్రపటానికి నివాళులు

ఆత్మకూరు ఎస్: సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రామన్నగూడెం గ్రామ సీనియర్ నాయకులు కామ్రేడ్ బురెడ్డి సంజీవరెడ్డి గత పది రోజుల క్రితం అమరత్వం చెందారు. ఆయనను స్మరించుకుంటూ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య పాల్గొని మాట్లాడుతూ సంజీవరెడ్డి రామన్నగూడెం గ్రామంలో విప్లవ రాజకీయాలను ఎంపిక చేసుకొని తన చివరి శ్వాస వదిలే వరకు నిలబడిన గొప్ప మనిషిని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సబ్ డివిజన్ నాయకులు కొండేటి సంజీవరెడ్డి, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు పుల్లూరు సింహాద్రి, పిడిఎస్‌యు డివిజన్ ప్రధాన కార్యదర్శి పిడమర్తి భరత్, పార్టీ గ్రామ కార్యదర్శి వీరారెడ్డి, నాయకులు సోమారపు పిచ్చయ్య, అయితగోని సైదులు, మాచిరెడ్డి, బత్తుల పిచ్చయ్య, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రతి అర్జీని పరిష్కరించాలి

- కలెక్టర్ ఎస్. వెంకట్రావ్

నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్

గ్రీవెన్స్ లో వచ్చే ప్రతి దరఖాస్తుని పరిష్కరించాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డీఎఫ్ఓ సతీష్ కుమార్, జెడ్పీసీఈఓ అప్పారావు, డిఆర్డీఓ మధుసూదన్ రాజుతో కలసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజావాణిలో ప్రజల నుండి స్వీకరించిన అర్జీలను అధికారులు జాగ్రత్తగా పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు.సూర్యాపేట పట్టణ పరిధిలో గల ఇందిరమ్మ మూడవ పేజ్ కాలనిలోని అలాగే కేసారం లో గల డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాలు పొందిన లబ్దిదారులకు ఇల్లులను అప్పగించుటకు 10 టీమ్ లు ఏర్పాటు చేసి సత్వరమే సమస్య ని పరిష్కరించి లబ్దిదారులకు త్వరగా ఇండ్లను అప్పగించాలని ఆర్డీఓ వేణు మాధవ్‌ని ఆదేశించారు.ఈ నెల 12 న పాఠశాలలు పున: ప్రారంభ సందర్భంగా పనులు పూర్తి అయిన అమ్మ ఆదర్శ పాఠశాలలను స్థానిక ఎమ్మెల్యేచే ప్రారంభించి విద్యార్థులకు యూనిఫామ్, పుస్తకాలు వారిచే ఇప్పించాలనిసూచించారు.



ప్రజావాణిలో ఎక్కువగా భూసమస్యలకు సబందించి 36, ఇతర శాఖలకు సంబంధించి 32 మొత్తం 68 దరఖాస్తులు అందాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమం లో సూర్యాపేట ఆర్డీఓ వేణు మాధవ్, డీఈవో అశోక్, డిపిఓ సురేష్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, డీఎంహెచ్ ఓ కోటాచలం, డిటిడిఓ శంకర్, బి డబ్ల్యు ఓ వెంకట రమణ, ఏవో సుదర్శన్ రెడ్డి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి

- మున్సిపల్ కమిషనర్‌కి వినతి



నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తలపెట్టిన 6 గ్యారంటీల పథక మునకు సంబంధించి గతంలో ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించిన గృహజ్యోతి, మహా లక్ష్మి పథకాలకు సంబంధించిన కొంతమంది అప్లికేషన్లను ఆన్లైన్ చేయాలంటూ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్‌కి బీఆర్ఎస్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఆన్లైన్ కౌంటర్లను మున్సిపల్ కార్యాలయంలో పాత మున్సిపల్ కార్యాలయంలో కౌంటర్లు ఏర్పాటు చేసి ఆన్లైన్ చేసి లబ్ధిదారులకు న్యాయం చేయవలసిందిగా విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఏవి కిరణ్ కుమార్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ తాడూరు బిక్షపతి, గుండబోయిన సురేష్ యాదవ్, సిరిపంగా సుభాష్, హరికిషన్ లు పాల్గొన్నారు.

ధర్మభిక్షం ఆశయ సాధనకు పోరాడాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహా



నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు, మాజీ మండల కమిటీ సభ్యులు పల్లెర్ల బిక్షపతి (ధర్మ భిక్షం) ఆశయ సాధనకై కూలీ, భూమి పోరాటాలను ఉధృతంగా కొనసాగిద్దామని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ పిలుపునిచ్చారు. భువనగిరి మండలం చీమలకొండూరు గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన పల్లెర్ల బిక్షపతి సంతాప సభకు ఆయన హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి దయ్యాల నర్సింహ, మండల కార్యదర్శి వర్గ సభ్యులు పల్లెర్ల అంజయ్య, కొండ అశోకు, మండల కమిటీ సభ్యులు సిల్వేరు ఎల్లయ్య, పాండాల మైసయ్య, మాజీ మండల కమిటీ సభ్యులు వడ్డెబోయిన వెంకటేష్, సీపీఐ(ఎం) శాఖ కార్యదర్శి బోడ ఆంజనేయులు, ముత్తిరెడ్డిగూడెం శాఖ కార్యదర్శి కూకుట్ల కృష్ణ, ముస్త్యలపల్లి శాఖ కార్యదర్శి కళ్లెం లక్ష్మి నరసయ్య, శాఖ సభ్యులు రావుల పోషాలు, రావుల కిష్టయ్య, పల్లెర్ల వినోదు, గ్రామ ప్రజలు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

పూలే, అంబేద్కర్ ఆశయ సాధనకు పాటుపడతా

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జూకంటి ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ-రాజపేట



తన గొంతులో ప్రాణం ఉన్నంత వరకు పూలే అంబేద్కర్ ఆశయ సాధన కోసం పాటుపడతానని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జూకంటి ప్రవీణ్ కుమార్ అన్నారు. బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం రాజీలేని పోరాటం కొనసాగిస్తున్న జూకంటి ప్రవీణ్ కుమార్ జన్మదినం సందర్భంగా సోమవారం రాజపేట మండల కేంద్రంలోని గాంధీ కూడలి వద్ద బీసీ కుల సంఘాల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దేశంలో సామాజిక అంతరాలు పోయి సమ సమాజ నిర్మాణం జరగాలన్నదే తన జీవిత లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కుల సంఘాల, రాజకీయపక్షాల నాయకులు ఊట్కూరి అశోక్ గౌడ్, మోత్కుపల్లి ప్రవీణ్, హిమ్మత్ సింగ్, తిరుమలేష్, వస్పరి సుధాకర్, రేగు సిద్ధులు,జన్నే సిద్ధులు, భూపతి శ్రీనివాస్, నరుండ్ల కర్ణాకర్ పాల్గొన్నారు.

టెక్నాలజీతో కూడిన విద్యను అందించాలి

- ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి

నవతెలంగాణ-హాలియా



నేటి విద్య విధానానికి టెక్నాలజీతో కూడిన విద్యను అందించవలసిన ఆవశ్యకత ఉంది అని నాగార్జునసాగర్ నియోజకవర్గ శాసనసభ్యులు కుందూరు జై వీర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నూతనంగా ప్రారంభించబడిన శ్రీ శ్లోక పాఠశాలను ఆయన ప్రారంభించి.అనంతరం ఆయన మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అందిస్తూ భవిష్యత్తులో పేద విద్యార్థులను కూడా ఆదుకోవాల్సిందిగా విద్య తో పాటు క్రీడలలో కూడా రాణించాలని సూచించారు. అటువంటి విద్యను అందించడానికి ముందుకొచ్చిన శ్లోక యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. అనంతరం పాఠశాల చైర్మన్ కుకుడాల ఆంజనేయులు మాట్లాడుతూ ఎంతో వ్యయప్రయాసలకు, ఒత్తిడి లకు,వడిదుడుకులను అధిగమించి సొంత ఊరిలో ఉన్నత విద్యను అందించాలనే ఉద్దేశంతో పాఠశాల ప్రారంభిస్తున్నామని కావున అందరూ తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు. మున్సిపల్ చైర్మన్ అనుపమ నరేందర్ రెడ్డి ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శేఖర్ రెడ్డి ,మండల్ పార్టీ అధ్యక్షులు వెంకటరెడ్డి, ఫ్లోర్ లీడర్ చంద్రా రెడ్డి , యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజా రమేష్, పాఠశాల చైర్మన్ కుకుడాల ఆంజనేయులు డైరెక్టర్స్ గుజ్జరి నవీన్ , కుకుడాల సంతోష్, చెరుకు నవీన్ కుమార్, కుకుడాల నరేష్, ప్రిన్సిపల్ సిద్ధికి మరియు తదితరులు పాల్గొనడం జరిగింది.

పర్యావరణ రక్షణ మాసంగా జరుపుకోవాలి

నవతెలంగాణ-నల్లగొండ

ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా క్లీన్ హోమ్-గ్రీన్ హోమ్ ప్రోగ్రాం ఆధ్వర్యంలో జూన్ నెల పర్యావరణ రక్షణ మాసంగా జరుపుకోవాలని క్లీన్ హోం గ్రీన్ హోమ్ ప్రోగ్రాం ఆర్గనైజర్ ఆదిమల్ల మనిరాజు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జూబ్లీహిల్స్ కాలనీలో మొక్కలు నాటి మాట్లాడారు. జూన్ నెల మొత్తం ప్రతిరోజు పర్యావరణాన్ని కాపాడుట కొరకు వివిధ ప్రాంతాలలో పదివేల (10,000) మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. వాతావరణంలో పెను మార్పులు వచ్చి ఎన్నడు లేనివిధంగా 45 డిగ్రీ నుండి48 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత పెరిగి విపరీతమైనటువంటి ఎండలు పెరిగాయని దీనిని అరికట్టాలంటే ప్రతి ఒక్కర%శీ% కనీసం ఒక్క మొక్కైన నాటి పెంచే బాధ్యత తీసుకోవాలని వార్డు ప్రజలను కోరారు. ఈ కార్యక్రమలో గోలి విజయ్ కుమార్ వేముల శేఖర్, గాదె లింగస్వామి, సువర్చల, యామిని, యువరాజు, హర్షిత, సృజన మొదలగువారు పాల్గొన్నారు.

మిర్యాలగూడ వ్యవసాయ మార్కెట్ చైర్మెన్ పదవి బీసీలకు ఇవ్వాలి

- బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్



మిర్యాలగూడ: మిర్యాలగూడ వ్యవసాయ మార్కెట్ చైర్మెన్ పదవిని బీసీలకు కేటాయించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానికంగా ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో అత్యధికంగా బీసీ జనాభా ఉన్నప్పటికీ కూడా నియోజకవర్గంలో ప్రభుత్వపరంగా ఎలాంటి నామినేటెడ్ పదవులు బీసీలకు అందకపోవడం బాధాకరున్నారు. నియోజకవర్గంలో వ్యవసాయ మార్కెట్ చైర్మెన్ పదవి గత 18 సంవత్సరాలుగా బీసీలు పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఏ రాజకీయ పార్టీ గెలిచినప్పటికీ బీసీలను ఓటు బ్యాంకు గానే వాడుకుంటున్నారని ఆరోపించారు. మార్కెట్ చైర్మెన్ పదవిని బీసీలకు కేటాయించి బీసీలకు అండగా ఉండాలన్నారు. బీసీలను అణచివేత ధోరణికి గురి చేస్తే మాత్రం పార్టీలకతీతంగా ఉమ్మడి ఉద్యమ కార్యాచరణ ప్రారంభిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్లపూడి శ్రీనివాస్, చిలకల మురళి యాదవ్, సిద్ధం రాజు, నరేష్, గంగాధర్, హరి గౌడ్, ఉపేందర్, రవి తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ నుండి తిరుపతికి ఆర్టీసీ బస్సు

నవతెలంగాణ-దేవరకొండ

దేవరకొండ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో సోమవారం తిరుపతికి సూపర్ లగ్జరీ బస్సు పున: ప్రారంభించినట్లు అసిస్టెంట్ మేనేజర్ పడాల సైదులు తెలిపారు. బస్సు దేవరకొండ బస్ స్టేషన్ నుంచి ఉదయం 10 గంటలకు బయలుదేరి హైదరాబాద్ చేరుకుని, అక్కడి నుంచి(హైదరాబాద్, ఎంజీబీఎస్) మధ్యాహ్నం 2:30 గంటలకు బయలుదేరి మాల్ 3:30, కొండమల్లేపల్లి 4:30 గంటలకు, హిల్ కాలనీ(నాగార్జునసాగర్) మీదుగా తిరుపతి చేరుకుంటుందని తెలిపారు. ప్రతి రోజు రెగ్యులర్ గా నడుస్తుందని, శ్రీకాళహస్తి, తిరుపతి వెళ్లాల్సిన ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తిరిగి తిరుపతి నుండి మధ్యాహ్నం 1.20 గంటలకు బయలుదేరుతుందని రిజర్వేషన్ సౌకర్యం ఉందని తెలిపారు. భక్తులు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నవతెలంగాణ

నల్లగొండ, సూర్యాపేట యాదాద్రిభువనగిరి

మంగళవారం | జూన్ 11, 2024 | www.navatelangana.com

ఎంపీ చామలను కలిసిన రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు



నవతెలంగాణ-తిరుమలగిరి

భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిని సోమవారం వారి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు సంకేపల్లి సుధీర్ రెడ్డి. వారితోపాటు సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సంకేపల్లి కొండల్ రెడ్డి, జిల్లా మైనారిటీ వక్ఫ్ బోర్డు మాజీ సభ్యుడు మహ్మద్ కలీం పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రభుత్వాస్పత్రిలో అన్నదాన కార్యక్రమం



నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య పుట్టినరోజు సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో న్యూ కంబాల శివలీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిక్షాల మహేష్, సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు దండంపలి సత్తయ్య సహకరించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు కంబాల శివలీల మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సేవా భావం తో సమాజానికి సేవ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీ డాక్టర్ సామాజిక సేవకర్త కృష్ణమాచారి, ఆర్ఎంపీ డాక్టర్ సామాజిక సేవ కర్త బడుగుల శ్రీనివాస్ యాదవ్, ఆర్ఎంపీ డాక్టర్ ప్రభాకర్, శివాజీ పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం : ఎస్పీ



నవతెలంగాణ-సూర్యాపేట

శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కరిస్తూ బాధితులకు అండగా ఉంటూ ఫిర్యాదుల పై వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యా లయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజావాణి లో బాధితుల నుండి వచ్చిన ఫిర్యాదుల పై ఆయా పోలీసు స్టేషన్ ల అధికారులతో మాట్లాడుతూ పోలీసు పరిధిలోని ప్రతి అంశాన్ని చట్ట పరిదిలో పరిష్కరించడంలో, బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆయన ఆదేశించారు. బాధితులకు ఖచ్చితంగా న్యాయం జరుగుతుందని ఆయన భరోసా కల్పించారు. ఆన్లైన్ నందు బహుమతులు వచ్చాయని ఫోన్ కాల్ ద్వారా అపరిచితులు వ్యక్తిగత వివరాలు, బ్యాంక్, ఏటీఎం పిన్, ఓటిపి వివరాలు అడుగుతారని ఇలాంటి బహుమతులు, ఉచితాలు నమ్మి మోసపోవద్దన్నారు. వీటి వెనుక సైబర్ మోసం ఉంటుందని దాన్ని గ్రహించాలన్నారు. బ్యాంక్ వారు ఎప్పుడూ కూడా ఫోన్ ద్వారా బ్యాంక్ ఖాతా వివరాలు అడుగరనేది గుర్తుపెట్టుకోవాలని కోరారు. ఫోన్‌లకు వచ్చే పిన్, ఓటిపి వివరాలను అపరిచితులు తెలిపితే ఆర్థిక నష్టం జరుగుతుందని తెలిపారు. కావున అపరిచితులు వ్యక్తిగత వివరాలు తెలపవద్దని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి 12 పిర్యాదు వచ్చినాయని, వివిధ సమస్యల పై బాధితుల నుండి వచ్చిన అర్జిలను స్వీకరించడం జరిగిందని పేర్కొన్నారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలని ధర్నా

నవతెలంగాణ-నల్గొండడెస్క్

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే ఇవ్వాలని గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో తిప్పర్తి ఎంపీడీవో ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించి ఎంపీఓ జానయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు కంచర్ల జానయ్య, పాలడుగు చంద్రయ్య మాట్లాడుతూ అనేక నెలలుగా కొన్ని గ్రామాల్లో 15 నుండి 16 నెలల పెండింగ్ వేతనాలు ఉన్నాయని వాటిని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి వెంటనే గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, కనీస వేతనం రూ. 26000 నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో



యునియన్ నాయకులు మైనం మల్లయ్య, వెంకన్న, సామేలు, పరమేష్, నాగయ్య, సౌందర్య, అషయ్య, బుజ్జమ్మ ప్రమీల, ఎసులు, హిమ్మత్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



నవతెలంగాణ-తిరుమలగిరి

త్వరలో జరగబోయే బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలో నాగారం సీఐ రఘువీర్ రెడ్డి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చెక్ పోస్ట్ ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాలుగు జిల్లాలకు కూడలి అయిన తిరుమలగిరి తెలంగాణ చౌరస్తా వద్ద ఇతర ప్రాంతాల నుండి హైదరాబాద్ తరలి వెళ్తున్న వాహనాలతో పాటు ఎలాంటి అనుమతి లేకుండా గోవులను తరలిస్తున్న వాహనాలను తనిఖీ చేసి రశీదులను పరిశీలించారు. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని హైదరాబాదులో ఎలాంటి అవాంఛనియ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా జిల్లా ఎస్పీ ఆదేశానుసారం తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలో చెక్ పోస్ట్‌ను ఏర్పాటుచేసి తమ సిబ్బందితో వాహనాలను తనిఖీ చేస్తున్నామని చెప్పారు. ఎవరైనా అక్రమంగా గోవులతో పాటు ఇతర సామాగ్రిని తరలిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి తోపాటు సర్కిల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ పట్టాను వెంటనే రద్దు చేయాలి



నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

నల్గొండ మండలంలోని దండంపల్లి గ్రామంలో సర్వే నెం 101 యందు ప్రభుత్వ భూమిని అక్రమంగా పట్టా చేయించుకున్న భూస్వామి బుసిరెడ్డి వెంకట్ రెడ్డి కుటుంబానికి ఇచ్చిన పట్టాను రద్దు చేసి దండంపల్లి దళిత పేదలకు న్యాయం చేయాలని జాతీయ మాల మహానాడు నేషనల్ స్టీరింగ్ కమిటీ సభ్యులు గోలి సైదులు డిమాండ్ చేశారు. అక్రమ పట్టాను రద్దు చేయాలని కోరుతూ బాధితులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ హరి చందనకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దండంపల్లి గ్రామం లో సర్వే నెం 101 యందు 111 ఎకరాల 37 గుంటల ప్రభుత్వ భూమి ఉంది. అందులో నుండి నల్గొండ పట్టణం లోని సీతారామచంద్ర దేవాలయానికి 53 ఎకరాల 8 గుంటల భూమిని దేవాలయానికి ఇచ్చారని అయితే తిప్పర్తి మండలం సర్వారం గ్రామానికి చెందిన బుసిరెడ్డి వెంకట్ రెడ్డి తండ్రి చంద్ర రెడ్డి అంధ విద్యార్థి పేరుతో 54 ఏకరాల ప్రభుత్వ భూమిని అధికారులతో కుమ్మక్కు అయి స్పెషల్ లావుని పట్టా పేరుతో 1954 సం.లో అక్రమంగా పట్టా పొందాడని తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో గోలి నర్సింహ్మ, మేడి వెంకన్న, చింత అర్జున, చింత ఆంజనేయులు, మేడి బాస్కర్, ఇంద్రకంటి సైదులు, చింత రేణుకమ్మ చింతపల్లి రామలింగయ్య, చింతపల్లి నర్సిహ్మా రావు, చింత లింగయ్య, గద్దపాటి సుజాత ఉన్నారు.

'ఎమ్మెల్యే మందుల సామేలు పై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోం'

నవతెలంగాణ-తిరుమలగిరి

తుంగతుర్తి నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే మందుల సామేలు రోజురోజుకు పెరుగుతున్న ప్రజా ఆదరణ చూసి ఓర్వలేక కొంతమంది కాంగ్రెస్ పార్టీలో ఉండి కోవర్టుగా బిఆర్ఎస్ పార్టీకి పనిచేస్తున్న వ్యక్తులు ఎమ్మెల్యే సామేలుపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని తుంగతుర్తి నియోజకవర్గ మీడియా ఇన్‌చార్జి కందుకూరి లక్ష్మయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాలిగౌరారం మండలంలోని వంగమర్తి, ఇటుకుల పాడు మూసి వాగు నుండి ఇసుక, ప్రభుత్వం అనుమతితోనే యాదాద్రి థర్మల్ ప్లాంట్, ఖమ్మం మున్నేరు వాగు సేఫ్టీ వాల్ నిర్మాణానికి కావలసిన ఇసుకను తుంగతుర్తి నియోజకవర్గం నుంచి ఇసుక తరలిస్తున్నట్లు స్వయంగా జిల్లా కలెక్టర్ దాసరి హరి చందన మీడియా ముఖంగా ఎమ్మెల్యే ఫోన్లో మాట్లాడగా వివరణ ఇచ్చారన్నారు. ఎమ్మెల్యేపై దుష్ప్రచారానికి పూనుకున్న వ్యక్తులు వారి విధివిధానాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. చామల కిరణ్ కుమార్‌రెడ్డి ఎంపీగా గెలవడం ఎమ్మెల్యేకు ఇష్టం లేదని చెప్పే దద్దమ్మలకు భువనగిరి పార్లమెంటు పరిధిలోని ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాలలో తుంగతుర్తి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే మందుల సామేలుకు నాడు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన మెజార్టీ కంటే అదనంగా 20 వేల మెజార్టీ



దాదాపు 70 వేల పైచిలుక మెజార్టీని తీసుకువచ్చిన ఘనత ఎమ్మెల్యే మందుల సామేలు దక్కుతుందన్నారు. ఎమ్మెల్యే ఉద్యమ కారుడు, ప్రజా నాయకుడు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉండే ప్రజా నాయకుడిని పట్టుకుని ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకునేది లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో బిక్కెరు లోకి వేసిన రోడ్డు సైతం తొలగించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతులకు అండగా ఉంటున్న ఎమ్మెల్యే మందుల సామేలుపై అంజయ్య స్వ ప్రయోజనాల కోసం అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. నారగోని అంజయ్య కు ఇసుక దందా చేసే అవకాశం ఇస్తే ఇలాంటి ఆరోపణలు చేసేవాడు కాదన్నారు. ఇక్కడ నుండి ఇసుక బందు కావడమే అంజయ్య ఆరోపణలు చేస్తున్నాడు తప్ప మరొకటి కాదని కందుకూరు లక్ష్మయ్య ఆరోపించారు. ఇకనైనా ఎమ్మెల్యే మందుల సామెల్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని హెచ్చరించారు.

ప్రభుత్వ అనుమతితోనే పవర్ ప్లాంట్‌కు ఇసుక తరలింపు



నవతెలంగాణ-నూతనకల్

ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం ప్రభుత్వం అనుమతితోనే యాదాద్రి పవర్ ప్లాంట్‌కి తుంగతుర్తి నియోజకవర్గం నుంచి ఇసుక తరలించడం జరుగుతున్నదని కాంగ్రెస్ పార్టీ నాయకులు చురకంటి చంద్రారెడ్డి ఎస్సీ సెల్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు నాగరాజులు అన్నారు సోమవారం మండల కేంద్రంలో మాట్లాడుతూ ఉద్దేశపూర్వకంగా శాసనసభ సభ్యులు మందుల సామేల్ పై కానీ కొంతమంది సోషల్, ఎలక్ట్రాన్ మీడియాలలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపణలు చేయడానికి తీవ్రంగా ఖండించారు నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరం తరం కృషి చేస్తున్న ఒక దళిత రైతు బిడ్డపై ఇలాంటి తప్పుడు ఆరోపణలు మానుకోవాలని లేనియెడల చట్టప రమైన తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యాడవల్లి మాజీ సర్పంచ్ సోమన్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాణాల మల్లారెడ్డి వీరయ్య శ్రీరాములు బత్తుల బిక్షం తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు దగ్ధం

నవతెలంగాణ-మోతే

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని అన్నారుగూడెం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం...అన్నారుగూడెం గ్రామానికి చెందిన పడిశాల సువార్త ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇల్లు కాలిపోయినట్టు తెలిపారు. ఈమెకు భర్త లేడు. ఒకే ఒక్క కుమారుడు ఇంటిలో ఉన్న సర్వం కాలిపోయినట్లు తెలిపారు. బాధితురాలిని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

పీఆర్‌సీ బకాయిల విడుదలపై హర్షం

నవతెలంగాణ-నేరేడుచర్ల

పశు గణాభివృద్ధి శాఖలో గోపాలమిత్రలుగా పనిచేస్తున్న1530 మందికి రూ. 7,36,18,560 కోట్లను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్‌రెడ్డి విడుదల చేయడం పట్ల గోపాలమిత్రల సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు రామయ్య హర్షం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో గోపాల మిత్రల సంఘానికి కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన విధంగా వంద రోజుల్లోనే పి ఆర్ సి బకాయిలు విడుదల చేసిందన్నారు.బకాయిలు విడుదల చేసిన ఆర్థిక శాఖ మంత్రివర్యులు భట్టి విక్రమార్క తో పాటు సహకరించిన జిల్లా మంత్రులు కెప్టెన్ నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తెలంగాణ రాష్ట్ర గోపాలమిత్ర సర్వీస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఎమ్మెల్యే వేముల వీరేశం, రాష్ట్ర అధ్యక్షుడు చేరుకు శ్రీనివాస్ సూర్యాపేట జిల్లా గోపాలమిత్రల సంఘం అధ్యక్షులు ఆల్దాస్ లింగయ్య గౌడ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల గోపాల మిత్రల సంఘం సభ్యులు జొన్నలగడ్డ సైదులు, మోదాల బాలస్వామి, కుర్రా రాములు, బాలకృష్ణ, భుజంగరావు, సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాను వెంటనే అమలు చేయాలి

- **సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు**



నవతెలంగాణ-తుంగతుర్తి

రాష్ట్రంలో ఖరీఫ్ సీజను ప్రారంభమైనందున రైతుల పెట్టుబడులకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసాను వెంటనే అమలు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు కోరారు. సోమవారం తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగస్తుల భవనంలో పార్టీ రాజకీయ శిక్షణ తరగతుల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైంది రైతులకు ఎరువులు విత్తనాలు కొనుగోలు చేసుకొనుటకు ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా సంక్షేమ పథకాన్ని వెంటనే అమలు చేసి రైతులను ఆదుకోవాలని ఆయన అన్నారు. రైతులకు అందించే విత్తనాలను సొసైటీలలో పూర్తిగా ఉండేటట్లుగా ఏర్పాటు చేసి సబ్సిడీల ద్వారా విత్తనాలు రైతులకు అందజేయాలని అలాగే ఎరువులను కూడా అందజేయాలని కోరారు. రెండు లక్షల రుణమాఫీని ప్రభుత్వం చెప్పిన విధంగా ఆగస్టు 15లోగా ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం చెప్పినట్లుగా ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయుటకు అర్హత కలిగిన కుటుంబాలకు రేషన్ కార్డులను వెంటనే ఇచ్చి ఇంటి స్థలాలు ఇల్ల నిర్మాణానికి ప్రభుత్వం వెంటనే చొరవ చూపాలని కోరారు.ఎన్నికల కోడ్ ఉన్నందున ప్రభుత్వం నిలుపుదల చేసిన సంక్షేమ పథకాలను కొనసాగించి ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బుర్ర శ్రీనివాస్, కందాల శంకర్‌రెడ్డి, మండల కార్యదర్శిలు కడియం కుమార్, కల్లేపల్లి భాస్కర్, నాయకులు దేవరాజు, ముత్తయ్య శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశ్వర్లు, సైదులు, వెంకయ్య సావిత్ర, శైలజ, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎడ్ సెట్ ఫలితాలు విడుదల

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

బీఈడీ రెండు సంవత్సరాల కోర్సు ప్రవేశానికి గాను మే 23న నిర్వహించిన ఎడ్ సెట్ 2024 ఫలితాలను మంగళవారం మధ్యాహ్నం 3 గంటల 30 నిమిషాలకు తెలంగాణ ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో మండలి చైర్మెన్ ఆచార్య లింబాద్రి, మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయ ఉపకులపతి నవీన్ మిట్టల్ ఐఏఎస్ విడుదల చేయనున్నట్లు కన్వీనర్ ఆచార్య తాళ్ల మృణాళిని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.



ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-చండూరు

మండల కేంద్రానికి చెందిన కమ్మంపటి చంద్రమ్మ ఇటీవల మృతి చెందింది. ఆ కుటుంబానికి చండూరు గౌడ సంఘం ఆధ్వర్యంలో సోమవారం రూ.12500 ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు బీమనపల్లి శేఖర్, బొమ్మగాని క్రిష్ణయ్య, చెనగాని కిరణ్, తందరి రవి, బొమ్మగాని కిరణ్, గణపతి, తిరుమలేష్ పాల్గొన్నారు.

నూతన చట్టాలపై సిబ్బంది అవగాహన కలిగి ఉండాలి

- **యస్పీ రాహుల్ హెగ్డే**

నవతెలంగాణ-సూర్యాపేట

నూతన చట్టాలపై ప్రతి పోలీసు సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎస్పి రాహుల్ హెగ్డే అన్నారు. ఇందులో భాగంగా సోమవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో అదనపు ఎస్పి నాగేశ్వర రావు తో కలిసి నిర్వహించిన శిక్షణ తరగతులో ఆయన మాట్లాడారు.దీనికోసం జిల్లా పోలీసు సిబ్బంది అందరికీ విడతల వారిగా వారం రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. నూతన చట్టాలు అమలు చేయడానికి ప్రతి అంశం పై సిబ్బందికి అవగాహన, నైపుణ్యం ఉండాలని అప్పుడే కచ్చితంగా నూతన చట్టాలను అమలు చేయగలుగుతామని పేర్కొన్నారు. కావున పోలీసు సిబ్బంది, అధికారులు ప్రతి ఒక్కరూ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సిబ్బంది అందరూ శిక్షణకు షెడ్యూల్డ్ ప్రకారం హాజరు కావాలన్నారు.ఈ తరగతులకు సీనియర్ హైకోర్టు అడ్వకేట్, సెంట్రల్ డిటెక్టివ్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్, తెలంగాణ పోలీస్ అకాడమీ అధ్యాపకులు డా సాంభ మూర్తి హాజరై వారం రోజులు సిబ్బందికి శిక్షణ ను ఇస్తున్నారు.

గంజాయి సరఫరా పై కఠినంగా వ్యవహరించండి : ఎమ్మెల్యే

నవతెలంగాణ-దేవరకొండ

నియోజకవర్గంలో దొంగతనాలు గంజాయి సరఫరా చేసే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే నేనా వత్ బాలు నాయక్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో నియోజకవర్గ పోలీస్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. పట్టణంలో దొంగతనాలను అరికట్టేందుకు యువత గంజాయి, ఇతర మత్తు మాదకద్రవ్యలపైన ఉక్కుపాదం మోపాలని సూచించారు.నేరస్తుల పట్ల కఠినంగా ఉంటూ, సాధారణ ప్రజలకి అందుబాటులో ఉండి న్యాయం జరిగేలా చూడాలని పోలిస్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డిఎస్పి గిరిబాబు ,దేవరకొండ, డిండి ,కొండమల్లేపల్లి సిఐలు ఎం. నర్సింలు ,సురేష్, ధనుంజయ గౌడ్ ,నియోజకవర్గం లోని ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.



15,16 తేదీల్లో న్యాయవాదుల శిక్షణా తరగతులను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-చౌటుప్పల్

ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఐలు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 15 ,16 తేదీల్లో రంగారెడ్డి కోర్టు ఆవరణలో జరిగే న్యాయవాద వృత్తి శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని ఐలూ జిల్లా అధ్యక్షులు మామిడి వెంకట్‌రెడ్డి, చౌటుప్పల్ బార్ ప్రెసిడెంట్ ఉడుగు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక కోర్టు ముందు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారంతోపాటు వృత్తి నైపుణ్యత ను పెంపొందించడానికి కృషి చేస్తుందన్నారు. యువ న్యాయవాదులకు ఐదు వేలు స్టైఫండ్, మృతి చెందిన న్యాయవాదులకు ఇస్తున్న నాలుగు లక్షల అష్టపరిహారంను ఆరు లక్షలకు పెంచాలని ,అర్హులైన న్యాయవాదులు అందరికీ ఇండ్లు, స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐలు జిల్లా ఉపాధ్యక్షులు తడకమోహన్ బార్ ఉపాధ్యక్షులు తాడూరు పరమేష్, సహాయ కార్యదర్శి జెల్లా రమేష్ కోశాధికారి బి మైపాల్ రెడ్డి మహిళా రిప్రెంటిటీ స్వాతి, జక్కర్తి శేఖర్, సీనియర్ న్యాయవాదులు బాల్యం వెంకటాచలం, బడుగు శ్రీకాంత్, జంగయ్య శ్రీశైలం,జ్యోతి ఎండి ఖయ్యూం, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తలకు బీమా అండ

- **మాజీమంత్రి జగదీశ్ రెడ్డి**

నవతెలంగాణ-సూర్యాపేట



గులాబీ జెండా గుండెకు హత్తుకొని నిత్యం ప్రజలతో మమేకమై వారి కష్టసుఖాల్లో భాగస్వామ్యమయ్యే కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని మాజీ మంత్రి , శాసనసభ్యులు గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలో ప్రమాదవశాత్తు మరణించిన ముగ్గురు బీఆర్ఎస్ కుటుంబ సభ్యులకు రెండు లక్షల చొప్పున బీమా చెక్‌లను వారికి అందజేసి మాట్లాడారు. గులాబీ సైనికులకు రక్షణ కవచంల భీమా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కష్టసుఖాల్లో తోడుంటూ కుటుంబాలకూ బిఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తున్నదన్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ పార్టీ కోసం, ప్రజల కోసం క ష్టపడే కార్యకర్తలకు ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే ఆ కుటుంబం రోడ్డున పడకుండా అండగా నిలువాలని కేసీఆర్ 2 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించారని తెలిపారు. గతంలో కొన్ని పార్టీలు తమ కార్యకర్తలకు బీమా కల్పించినా.. ఇంత క్రమశిక్షణతో కొనసాగిస్తున్న పార్టీ మాత్రం బీఆర్ఎస్సే నని పేర్కొన్నారు. కష్ట కాలంలో తమను ఆదుకున్న బిఆర్ఎస్ పార్టీకి రుణపడి ఉంటామని బాధిత కుటుంబ సభ్యులు అన్నారు. తమకు బీమా పరిహారం అందేలా కృషి చేసిన జగదీష్ రెడ్డి కి ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. పరిహారం అందుకున్న వారిలో పెన్ పహాడ్ మండలం ధర్మాపురం కు చెందిన మొండి కత్తి భాగ్యమ్మ, పట్టణానికి చెందిన కాసాని బుచ్చి నరసయ్య, కాసాని జానమ్మ కుటుంబ సభ్యులు ఉన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెరుమాల అన్నపూర్ణ, వైస్ చైర్మన్ పుట్ట కిషోర్, ఎంపీపీ నెమ్మాది బిక్షం,లవకుశ, రఫీ, బిఆర్ఎస్ పట్టణ మహిళా అధ్యక్షురాలు కరుణ శ్రీ,యూత్ నాయకులు నెమ్మాది నగేష్ ,ముదిరెడ్డి అనిల్ రెడ్డి ,ఎలక హరీష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.